KSR02B121C
ENTERED

ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
మే 15, 2016

విలన్ హీరో



కథా నిలయం
శ్రీకాకుళం

సై-ఫై వైద్యం







ఇన్‌స్టెంట్ తారలు

అభిమాన నటీనటుల గురించి ఎప్పటికప్పుడు వివరాలు తెలుసుకోడానికి ఇష్ట పడుతుంటారు అభిమానులు. ట్విటర్, ఫేస్‌బుక్ వంటి అనేక సామాజిక మాధ్యమాల్లో రెగ్యులర్‌గా ఫాలో అవుతున్నా పర్సనలైజ్డ్ ఫొటోలు, వీడియోల్లో ఏదో కొంచెం వెలితిగా అనిపిస్తుంటుంది. ఆ లోపాన్ని ఇన్‌స్టాగ్రామ్‌లో భర్తీ చేస్తుంటారు తారలు. ఈ ఖాతాలకు ఫాలోవర్స్ సంఖ్య విపరీతంగా పెరిగిపోతోంది. ఇప్పటికే శ్రద్ధాకపూర్, సోహాఅలీఖాన్, నర్గీస్ ఫక్రీ,.జాక్వెలిన్ ఫెర్నాండెజ్, ఇలియానా, దీపికా పదుకోన్, బిపాష షూటింగ్ స్పాట్‌లో తీసుకున్న సెల్ఫీలతో పాటు, తమ మిత్రులతో సరదాగా గడిపిన క్షణాలను కెమేరాల్లో బంధించిన రకరకాల స్టిల్స్‌తో అభిమానులని ఆకట్టుకుంటున్నారు. అశిన్, ఆలియా భట్, అదితి రావ్‌హైదర్ ఒక్కొక్కరిదీ ఒక్కో టేస్టు. టూర్‌లంటే ఎక్కువగా ఇష్టపడే సోనాక్షి పర్యాటక ప్రదేశాల్లో తను దిగిన చిత్రాలను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేస్తుంటుంది. శృతి హాసన్ ఇటీవల క్యామ్‌లో దిగిన సెల్ఫీలను అప్‌లోడ్ చేస్తే సెల్ఫీ క్వీన్ ప్రియాంక షూటింగ్ లొకేషన్‌లో దిగిన ఫోటోలతో హల్‌చల్ చేస్తోంది. రణబీర్ కపూర్, షాహిద్, అక్షయ్, సల్మాన్, హృతిక్‌లు కూడా తరచూ తమ ఫోటోలతో అభిమానులకు దగ్గరవుతున్నారు. సినీ అభిమానులందరూ ఇన్‌స్టాగ్రామ్‌ని విపరీతంగా ఫాలో అవుతుంటే ఇప్పటి వరకు ట్విటర్, ఫేస్‌బుక్‌లలో మాత్రమే తన ఫోటోలను పెడుతున్న కరీనా కపూర్ ఇపుడు ఇన్‌స్టాగ్రామ్‌లోను పలకరించబోతోంది.







KSRO 2 B.121

చెరువుల చెలికాడు



రాజస్థాన్‌లోని జైపూర్‌కు 80 కి.మీ. దూరంలో ఉన్న లపోరియా గ్రామ ప్రజలు హాయిగా వేసవి సెలవుల్ని గడిపేస్తున్నారు. కణకణలాడే ఎండల నుంచి చల్లని నీటితో ఉపశమనం పొందుతున్నారు. కొన్ని దశాబ్దాలు వెనక్కు వెళితే నెర్రెలిచ్చిన నేలలు, బోసిపోయిన బావులు, దిగులు పెట్టుకున్న ఇళ్లు మాత్రమే కనిపించేవి. అలాంటి ఇళ్లలో లక్ష్మణ్ సింగ్‌ది ఒకటి. ఆ గ్రామంలో తమతో పాటు జీవచ్ఛవంలా ఎందుకు బతకాలని అతణ్ని బడి చదువు కోసం పట్నం పంపించారు తల్లిదండ్రులు. కానీ కరువు అక్కడ వరకు ఎఫెక్ట్ ఇచ్చింది. లక్ష్మణ్ సింగ్ ఫీజులు కట్టలేక వెనక్కు పిలిపించేసింది కుటుంబం. పట్నంలో చదువు లేకపోతే ఉపాధి లేదు, పల్లెల్లో నీళ్లు లేకుంటే ఉపాధి లేదనే విషయం బాగా అర్థమయ్యాయి అతడికి. 1978లో ఊరికి వస్తూనే ఏం చేస్తే బాగుపడుతుందా అని ఆలోచిస్తూనే వచ్చాడు. ఊళ్లో ఓ శిథిలమైన చెరువు ఉంది. 230 ఏళ్లుగా దాన్ని పట్టించుకున్న వాళ్లు లేరు. దాన్ని బాగు చేసుకుంటే చెదురు మదురు వర్షాలపుడు కొంచెం నీటినైనా ఒడిసిపట్టొచ్చని గ్రామస్తులకు చెప్పాడు. ఆ కొంచెంతో ఏం చేద్దాం? వ్యవసాయమా అంటూ ఎగతాళి చేశారు అతడి ఆలోచనను. అయినా దాన్ని బాగు చేయడానికి బోలెడు ఖర్చైద్ది ఎవరిస్తారంటూ ప్రశ్న లేవనెత్తారు. ప్రభుత్వం ఆ ఊరిని మర్చిపోయి చాలా ఏళ్లయిందని అందరూ అనే సరికి లక్ష్మణ్ సింగ్ ఆశ నీరుగారిపోయింది. కొన్ని రోజులకు అందరం కష్టిస్తే సులువే కదా అని వాదించాడు. అయినా ఎవరూ ముందుకు రాలేదు. కానీ ఊరికే ఉండలేక ఒక్కడే చెరువు వద్దకు వెళ్లాడు. సాధ్యమైనంత వరకు బండల్ని కదిలించాడు. పిచ్చిమొక్కల్ని పెరికేశాడు. మట్టిని తవ్వి తీశాడు. చెరువు కట్ట 1.5 కి.మీ.లుంటుంది. 15 అడుగుల ఎత్తుంటుంది. ఒక్కడే ఏం చేయగలడని మిత్రుడొకడు తోడొచ్చాడు. ఇద్దరూ కలిసి మరిన్ని బండల్ని కదిలించారు. దారినపోయే వాళ్లు మీ ఇద్దరి వల్ల ఏమౌతుందిరా అనేవాళ్లు. అయితే మీరు ఓ చేయి వేయండంటూ మిత్రులిద్దరూ అడిగేవాళ్లు. అలా వారం తిరిగేసరికి 20 మంది బృందం చెరువు పనుల్లో పడ్డారు. ఆ ఇరవై మందే చాలా పనిని పూర్తి చేసేశారు. రెణ్నెళ్ల తర్వాత మోస్తరు వర్షాలు కురిశాయి. చెరువులో జలకళ కనిపించింది. కొన్ని దశాబ్దాల తర్వాత చెరువులో నీళ్లు పడటంతో ఊరు ఊరంతా అక్కడకు చేరుకుని దాన్నో వింతలా చూశారు. ఇక అందరూ ఓ నిర్ణయానికొచ్చారు. వచ్చే వర్షాకాలం నాటి కల్లా చెరువును పూర్తిగా బాగు చేసుకుందామని. అలా 1984 నాటికి దాదాపు 1800 ఎకరాలకు నీరు అందించేంత నీటి నిధిని ఏర్పాటు చేసుకోగలిగారు. అప్పటికి పైసా ఆదాయం లేని ఆ ప్రాంతంలో ఒక్కో కుటుంబం ఏడాదికి 14 వేల రూపాయల్ని సంపాదించే స్థాయికి చేరుకుంది. అందుకే దానికి 'అన్నా సాగర్' అనే పేరు పెట్టుకున్నారు. అంటే ధాన్య సాగరమని అర్థం.

'చౌకా' చౌక

అక్కడితో ఆగిపోలేదు లక్ష్మణ్ సింగ్. 'చౌకా' అనే ఓ నీటి వ్యవస్థను రూపొందించాడు. ఇదే ఆ గ్రామం కథను మరింత మలుపు తిప్పింది. ఊరి చుట్టూతా 5 కి.మీ.ల వరకు చెరువు గడుల్ని, పాయల్ని ఏర్పాటు చేశాడు. కేవలం రెండడుగుల ఎత్తులో ఉండే నీటి గడులు అవి నిండాక నీరు కిందకు పోయేలా కాలువలు ఇలా ఒక్క నీటి చుక్క కూడా వృథా కాకుండా మొత్తం వర్షం నీరు గ్రామం వద్దే భూమిలోకి ఇంకేలా ప్లాన్ వేశాడు. ఆ ఇంకుడు గుంటల్లో గడ్డి పెరగడంతో నీరు ఆవిరయ్యే శాతం తగ్గిపోయింది. అటు పశువుల మేతకు చక్కగా ఉపయోగపడింది. వీటినే 'గోచర్' అంటారు. ఊరికి ఉమ్మడి నేలగా ఉండే వీటిని కబ్జాదారులు ఆక్రమించుకుని పశువులకు దాణా లేకుండా చేసేవాళ్లు. కానీ లక్ష్మణ్ సింగ్ గ్రామస్తుల్లో చైతన్యం కలిగించడంతో గోచర్‌లు ఎవరి బారిన పడకుండా కాపాడుకున్నారు. రాజస్థాన్‌లో పచ్చగా కళకళలాడుతున్న గోచర్‌లను చూసే ఆ గ్రామం సిరిసంపదల్ని లెక్కించేవాళ్లు. అన్నా సాగర్ తర్వాత ఇపుడా గ్రామంలో దేవ్ సాగర్, ఫూల్ సాగర్ కొత్త శోభను తెచ్చాయి. ఏడాదిలో రెండు పంటలకు సత్తువనిచ్చాయి. వీరి శ్రమదానం ఇచ్చిన ఫలితాల్ని చూసి పొరుగు గ్రామాలు కూడా ఏకతాటిపై నిలిచి చెరువుల ప్రక్షాళనకు కదిలాయి. ఈ ఉద్యమానికి మరింత ఊపునిచ్చేందుకు 500 మంది లపోరియా గ్రామస్తులు దూర గ్రామాల వరకు పాదయాత్రలు చేసి కరువు సీమలో చైతన్యం తెచ్చారు. పొరుగు గ్రామస్తులకు తమ శ్రమదానాన్ని అందించి మరింత వేగంగా గ్రామాల తీరుతెన్నులు మారేలా కృషి చేశారు. గ్రామ్ వికాస్ నవయువక్ మండల్ లపోరియా పేరిట ఓ సంఘంగా ఏర్పడి గ్రామాభివృద్ధికి తోడ్పాటునందిస్తున్నారు. ఇప్పుడు గ్రామ జనాభా 2 వేలకు చేరుకుంది. వీరందరి నీటి అవసరాలు తీరడమే కాదు పక్కనున్న మరో 10–15 గ్రామాలకు కూడా నీరు అందిస్తోంది. మరో 58 గ్రామాల్లో లక్ష్మణ్ సింగ్ నీటి వ్యవస్థ సమర్థంగా పనిచేస్తోంది. ఇదే కాదు పక్షుల సంరక్షణ కోసం అటవీ ఉద్యమాన్ని కూడా చేపట్టాడు. ఇప్పుడు లపోరియా ప్రాంతంలో అనేక జాతుల పక్షుల్ని చూడొచ్చు. ✦

ఒకప్పుడు స్నానమనేది ఓ విలాసం లపోరియాలో. నీటి కట కట. ఓ సబ్బు బిళ్ల కొనలేని పేదరికం గ్రామస్తులది. ఆకలి దప్పికల వెతలు వీరికి తెలిసినంతగా ఎవరికీ తెలీవేమో. అలాంటి లపోరియా ఇప్పుడు మిగతా కరువు సీమల్లో నీటి సడి వినిపించేలా చేస్తోంది. సిరి సంపదలతో కొత్త కళనద్దుకుందిపుడు. ఓ స్మాల్ డ్రాపౌట్ ఊరి పరిస్థితిని మార్చేసిన కథే ఆ గ్రామానిది.

ఇండెక్స్

స్ఫూర్తి...............3
పేదింటి పిల్లలు
సివిల్ టాప్ ర్యాంక్ కొట్టారు

విజేత............... 4
కాళ్లు లేని జెన్నిఫర్ కథ

కార్టూన్ పంచ్......... 5

వింతలోకం..................10
'బంగారు' భిక్షువు

స్టార్...............11
విలనీ హీరో

కొత్త పుస్తకాలు...............14
జూకామల్లి..ఓ
కవితా ఝురీ!

సై-ఫై వైద్యం



అట్టమీది కథ.........6

నా కళ్ళతో - 12
సాహసమే శ్వాసగా

తెలుసా..................15
కుటుంబాలు బాగుండాలి

వివరం 16
ఏ గ్రంథాలో..?

కథ...............18
పిడికెడు మట్టి

రుచి....................21
నువ్వుల ఆవకాయ

బాల నేస్తాలు.............22
చిట్టి ఏరోప్లేన్

పద వికాసం...............24

కబడ్డీ క్వీన్

బాక్సర్‌గా మాధవన్ నటించిన సినిమా చూసి అతని కొడుకు కూడా అదే వృత్తిలో శిక్షణ తీసుకోవడం అభినందనీయం. క్యారెక్టర్ నటుడు మనోజ్ బాజ్‌పేయి అలీఘర్ సినిమాలో ఉత్తమ నటనకి దాదాసాహేబ్ ఫాల్కే అవార్డుకు అతను ఎన్నిక కావడం గొప్ప విజయం.పల్లె అమ్మాయి మమతా పూజారి ఆటల్లో రాటు దేలి కబడ్డీ పోటీలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సాధించిన విజయాలు ఎందరికో స్ఫూర్తిదాయకం. కొల్లూరు గనిలో లభించిన కోహినూర్ వజ్రం 8 శతాబ్దాలుగా ఎందరో రాజులు, చక్రవర్తుల మధ్య బహుమతి వస్తువుగా చేతులు మారి చివరగా బ్రిటన్‌లో పాతుకుపోవడం ఉద్రేక పరిచింది.

- టి.సత్యనారాయణ మూర్తి, విశాఖ

కేరింత చిత్రాలు

సరదాగా కాసేపు పిల్లలకు వినోదాన్ని అందించే సినిమాలుగా ప్రచారంలో ఉన్న కార్టూన్ చిత్రాలు పిల్లలతోపాటు పెద్దల్ని ఎంతలా ఆకట్టుకుంటున్నాయో కళ్లకు కట్టినట్టు వివరించారు. దాహం వేసినప్పుడల్లా ఏదో ఒక కూల్‌డ్రింక్ బాటిల్‌ని కొని తాగేస్తుంటాం. ఇక వేసవిలో వీటి వాడకం మరింత ఎక్కువవుతుంది. రుచికి తియ్యగా ఉన్నా ఆరోగ్యానికి అవి చేసే హానిని క్లుప్తంగా వివరించారు. ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న నటుడు మనోజ్ బాజ్‌పేయి. తొలి రోజుల్లో ఎన్నో కష్టాలు పడ్డ బాజ్‌పేయి తన నటనా ప్రతిభతో దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు అందుకోవడం అభినందనీయం.
భారతదేశంలో కనుగొన్న కోహినూర్ చరిత్ర ప్రస్తుతం వివాదకరంగా మారడం విచారకరం.

- సాహిత్య, ఒంగోలు

ఆకట్టుకున్నాయి

చిన్న పిల్లల కోసం నిర్మించిన చిత్రాలనుకున్నా సాంకేతిక పరంగా, వైజ్ఞానికంగా అందరినీ అకట్టుకున్న కార్టూన్ చిత్రాలు కథనం ఆద్యంతం చదివించింది. కూల్‌డ్రింక్‌లో వాడే వివిధ రసాయనాలు మన ఆరోగ్యానికి ఏవిధంగా హాని చేస్తున్నాయో తెలుసుకుని ఆశ్చర్యపోయాం. మిల్క్‌షేక్ రుచులు బాగున్నాయి. కార్టూన్ పంచ్, జోక్స్ బాగున్నాయి. మారుమూల పల్లెటూరులో పుట్టిన మమతా పూజారి అంతర్జాతీయ క్రీడాకారిణిగా ఎదగడం అభినందనీయం. మూడో తరగతిలో చదువుకు దూరమైనా హల్దార్ నాగ్ సొంత కృషితో తాను చేసిన రచనలు పరిశోధకులకు యూనివర్సిటీ పాఠ్యాంశాలుగా మారటం గొప పరిణామం. మొగుని పొటుకలు కథ ఆకట్టుకుంది.

-అంబరీష్, కర్నూలు

కబడ్డీ కెరటం

కర్ణాటకలోని ఒక గ్రామంలో పుట్టిన మమత ఆటల్లో చురుగ్గా పాల్గొంటూ అంతర్జాతీయ స్థాయి క్రీడాకారిణిగా ఎదగడం అభినందనీయం. కూల్ డ్రింక్‌తో చేటే ఆద్యంతం చదివించింది. ప్రజాకవి హల్దార్, నవ్వుతూ బతకాలిరా, స్వయంకృషి, వింతలోకం,క్రీమ్ బిస్కెట్లపై ఎంబ్రాయిడరీ డిజైన్లు ఆకట్టుకున్నాయి. కార్టూన్ పంచ్, బాలనేస్తాలు, పదవికాసం, అగ్ని పర్వత అద్భుతలోకం బాగున్నాయి.

-మనస్వి, అనంతపురం

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ.-520002.
మెయిల్ అడ్రస్ : snehaweekly.praja@gmail.com

కథా నిలయం
స్వాతి
శ్రీకాకుళం
ENTERED


కులదీప్ త్రివేది

పేదింటి పిల్లలు సివిల్స్ టాప్ ర్యాంక్ కొట్టారు

ఆ ఫలితాల కోసం ...వాళ్లు కళ్లు కాయలు కాచేలా ఎదురు చూశారు. వాళ్లతో పాటు వారి మీదే ఆశలు పెట్టుకున్నవారూ ఆ క్షణం కోసమే పరితపించారు. ఎట్టకేలకు ఆ ఘడియ రానే వచ్చింది. యుపిఎస్‌సి ఈ వారంలో విడుదల చేసిన సివిల్స్ పరీక్షా ఫలితాలు... దేశవ్యాప్తంగా వెయ్యి మందికి పైగా అభ్యర్థులు, వారి కుటుంబాలలో ఆనందం నింపాయి. వీరిలో ప్రతి ఒక్కరిదీ విజయ యాత్రే. అయితే అందులో ముగ్గురి విజయగాథ ప్రత్యేకమైనది. పేదరికంలో పుట్టి పెరిగి ... అనునిత్యం అవాంతరాలు ఎదురైనా... కసితో అనుకున్నది సాధించారు. వారిలో ఒకరు సెక్యూరిటీ గార్డ్ బిడ్డడైతే, మరొకరు ఆటోడ్రైవర్ కుమారుడు. ఇంకొకరు చిన్నపాటి పచారీకొట్టు నడిపే సామాన్యుడి కుమార్తె.

సూర్యకాంత్ ద్వివేది లక్నో యూనివర్సిటీలో సెక్యూరిటీ గార్డు. తనకొచ్చే కొద్దిపాటి సంపాదనతో ఐదుగురు సభ్యులున్న కుటుంబాన్ని పోషించడమే చాలా కష్టం. సభ్యులంతా ఏదో ఒక పని చేసి ఎంతో కొంత అదనంగా జత చేయాల్సిందే. అలాంటి పరిస్థితుల్లో సూర్యకాంత్ కుమారుడు కులదీప్ సివిల్స్ పరీక్షలు రాయాలన్న తన సంకల్పాన్ని తండ్రికి తెలియచేశాడు. అందుకు అంగీకరించడమూ అంటే ఒకరి ఆదాయాన్ని కోల్పోవడమే. అయినప్పటికీ ఆ తండ్రి సంతోషంగా కొడుకు భుజం తట్టాడు. అలా ఒకటి కాదు రెండు కాదు. మూడు సార్లు ప్రయత్నించాడు. ప్రతిసారీ తన కుటుంబ మద్దతుతో మరింత పట్టుదలతో అనుకున్నది సాధించాడు కులదీప్.

"నా చిన్నప్పటి నుంచి... జిల్లా కలెక్టర్...అతని అధికారాలు చూసి స్ఫూర్తి పొందేవాడిని. నేనూ అలాగే కలెక్టర్ కావాలని కలలు కనేవాణ్ణి. ఆ కల అలా నా మనసులో మెదులుతూనే వుండేది" అని చెప్తాడు కులదీప్. ఆ పట్టుదలతోనే అనుకున్న లక్ష్యం చేరుకున్నాడు. ఈ ఏడాది సివిల్స్ సర్వీస్ పరీక్షల్లో 242వ ర్యాంకు సంపాదించుకుని యువ ప్రపంచానికే స్ఫూర్తినిస్తున్నాడు. బీదింటి బిడ్డడిగా తను అంతటి విజయం సాధించినా... దాన్ని పూర్తిగా అర్థంచేసుకునే చైతన్యం కుటుంబానికి లేకపోవడంతో... అందరినీ కూర్చోబెట్టి అరగంటసేపు వివరించాల్సి వచ్చింది. "వాళ్లు ఐ.పి.ఎస్ అంటే ఏంటో కూడా అర్థంచేసుకోలేరు. పోలీస్ విభాగంలో సబ్ఇన్‌స్పెక్టర్‌కే ఎక్కువ అధికారాలు వుంటాయనుకుంటారు. శిక్షణ పూర్తయ్యాక ఏదో ఒక జిల్లాకి అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎఎస్‌పి)గా నియమితులౌతానని చెప్పాను. నేను అధికారిని అయ్యానన్న విషయం వారికి అర్థమయ్యేసరికి పూర్తి నిశ్శబ్దం చోటుచేసుకుంది. వాళ్ల కళ్లలో నీళ్లు సుడులు తిరిగాయి" అని చెప్తాడు కాబోయే యువ పోలీస్ అధికారి. ఇక అతని తండ్రి సూర్యకాంత్ ద్వివేది ఆనందమైతే మాటల్లో చెప్పనలవి కాదు. "ఇంత తియ్యటి వార్తను ముందుగా యూనివర్సిటీలోని ఇతర గార్డులతో పంచుకున్నాను. తర్వాత నేరుగా ఇంటికెళ్లాను. కష్టపడి నేను సంపాదించిన డబ్బు వృథా కానందుకు గర్విస్తున్నాను' అంటాడు తృప్తిగా.

మహారాష్ట్ర, షెల్గాన్ గ్రామంలోని మురికి వీధులు దాటుకుంటూ వెళ్తేగాని అన్సార్ అహ్మద్ షేక్ ఇల్లు రాదు. 21 సంవత్సరాల అన్సార్ ఆటోరిక్షావాలా కుమారుడు. అన్న మెకానిక్. ఇదీ అతని నేపథ్యం. వారి అరకొర సంపాదనతోనే అనుకున్నది సాధించాడు. "ఇప్పటి దాకా మా అన్నే నాకు అండగా నిలబడ్డాడు. తను లేకుండా నేనీ విజయం సాధించగలిగేవాడినే కాదు. తనకి జీవితాంతం రుణపడి వుంటాను" అని చెప్తున్నాడు అన్సార్. రోజుకి 13 గంటలపాటు కష్టపడి చదివి ... తొలిసారే మంచి ర్యాంక్ కొట్టేశాడు.

శ్వేత అగర్వాల్‌ది మరో విజయగాథ. తండ్రి పశ్చిమ బెంగాల్‌లోని భద్రేశ్వర్‌లో పచారీ కొట్టు నడుపుతుంటాడు. తల్లి గృహిణి. 'అమ్మానాన్నా కటిక దరిద్రంలో వుండి కూడా వున్నంతలో మంచి స్కూళ్లు, కాలేజీల్లో చదివించారు నన్ను. ప్రపంచంలోకెల్లా ఉత్తమ తల్లిదండ్రులు వారు' అంటోంది శ్వేత. ముచ్చటగా మూడో ప్రయత్నంలో గోల్ కొట్టేసింది. 19వ ర్యాంక్ పట్టేసింది.

యు.పి.ఎస్.సి నిర్వహించే సివిల్ సర్వీస్ పరీక్షలను దేశంలోకెల్లా అత్యంత కఠినమైన పరీక్షలుగా చెప్పుకుంటారు. కృషి, పట్టుదల వుంటే ఎవరి విజయగాథను వారే రాసుకోవచ్చని నిరూపించారీ ముగ్గురు. ✦


అన్సార్ అహ్మద్ షేక్

శ్వేత అగర్వాల్

రెండు కాళ్లు లేకుండా పుట్టిన జెన్నిఫర్ రెండు యుద్ధాలు చేసింది. ఆ రెండు యుద్ధాలు.. తనకే లోపం లేదని నిరూపించుకోడానికే. ఒకటి.. ఏదైతే ఆమెకు అసాధ్యమన్నారో ఆ జిమ్నాస్టిక్స్‌లో ఒలంపిక్ మెడల్ కొట్టి అంగ వైకల్యాన్ని జయించింది. రెండు.. పనికిరాదని వదిలించుకున్న కుటుంబాన్ని తిరిగి దక్కించుకుని తానే అమ్మకు పెద్ద దిక్కయి ఇంట గెలిచింది. గుండె ఎడమ వైపున కాకుండా కుడివైపున ఉంటుందామెకు. జీవితంలోను తన ఆరాధ్య జిమ్నాస్ట్ విషయంలో ఇలానే ఎడమ కుడి అయ్యింది. జెన్నిఫర్ కథలో అత్యంత ఆసక్తికరమైన విషయమేమంటే ఎవరినైతే తన రోల్ మోడల్‌గా జిమ్నాస్టిక్స్ ప్రాక్టీస్ చేసిందో ఆమెవరనే నిజం. ఓ సినిమాను తలపించే ఈ విజేత లెగ్‌లెస్ జెన్నిఫర్ కథ యదార్థం.



కాళ్లు లేని జెన్నిఫర్ కథ

పుట్టుకతోనే కాళ్లు లేకపోవడంతో తాను జన్మించిన రోజే (1987 అక్టోబర్ 1) తల్లిదండ్రులు ఆమెని రొమేనియా ప్రాంతంలో వదిలేశారు. అమెరికా ఇల్లినాయిస్ నగరానికి చెందిన గెరాల్డ్, షారన్ బ్రికర్‌ల కంటబడటంతో ఆమెను అక్కున చేర్చుకున్నారు. అప్పటి నుండి వాళ్ల సంరక్షణలోనే పెరిగింది జెన్నీఫర్. పెద్దయ్యే కొద్దీ జన్నీఫర్‌కి అడుగడుగునా సమస్యలు ఎదురయ్యేవి. జీవితంలో నువ్వు సాధించలేనిది ఏది లేదంటూ పెంపుడు తల్లి షారన్ తనకి ధైర్యాన్ని నూరిపోసింది. అప్పటికే షారన్‌కి ముగ్గురు కొడుకులు పుట్టారు. జెన్నిఫర్‌ని కూడా వారితో సమానంగా చూసుకునేది షారన్. జెన్నిఫర్ ఆలోచనలు, ఆశయాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ముందుకు నడిపించేది. ఆమె అందించిన ధైర్యం జెన్నిఫర్‌ని మరింత శక్తివంతంగా తయారుచేసింది. ఏవైతే జెన్నిఫర్‌కు కాదు అనే క్రీడల్లోనే తన సత్తా చాటి వైకల్యమంటే ఏంటనే ప్రశ్నను లేవనెత్తింది. ఈత, వాలీబాల్, సాఫ్ట్‌బాల్, బాస్కెట్ బాల్ వంటి క్రీడల్లోనూ జెన్నిఫర్ ఆరితేరింది. చిన్ననాటి నుంచే జెన్నిఫర్‌కి జిమ్నాస్టిక్స్ అంటే ఎంతో ఇష్టం. వాటికి సంబంధించిన కసరత్తులని తనకు తెలీకుండానే చిన్ననాటి నుండే ప్రారంభించింది. పదేళ్లు వచ్చేసరికి తండ్రి గెరాల్డ్ సాయంతో ట్రాంపోలిన్‌పై టంబ్లింగ్ చేస్తుండేది. జిమ్నాస్టిక్స్‌లో ఆరితేరిన క్రీడాకారిణి డొమినిక్ మొసియా తన రోల్‌మోడల్. జిమ్నాస్టిక్స్‌లో బంగారు పతకాన్ని సాధించిన డొమినిక్ వీడియోలను రోజూ టీవీలో పరిశీలుస్తూ మరిన్ని మెళకువలు నేర్చుకుంది జెన్నిఫర్. తన అభిరుచిని గ్రహించిన జెన్నిఫర్ తల్లిదండ్రులు ఆమెకు పవర్ టంబ్లింగ్‌లో శిక్షణ ఇప్పించారు. అదేదో సాదాసీదా శిక్షణ తీసుకోలేదు జెన్నిఫర్. సిల్క్ రిబ్బన్‌ల సాయంతో గాల్లోకి 30 అడుగుల ఎత్తుకు ఎగిరి పడుతూ విన్యాసాలు చేసేది. ఆమె జూనియర్ ఒలంపిక్స్ టంబ్లింగ్‌లో రాష్ట్రస్థాయి విజేతగా నిలబడగలిగింది. అంగవైకల్యం కలిగున్నా టంబ్లింగ్‌లో విజేతగా నిలవడం తమని ఆశ్చర్యాన్ని గురిచేసిందంటూ స్నేహితులు ఆమెను పొగడ్తలతో ముంచెత్తారు. వాళ్ళు తనపై జాలిపడటం జెన్నిఫర్‌కి నచ్చలేదు. వెంటనే జెన్నిఫర్ "నాకు అంగవైకల్యం లేదు" అంటూ సమాధానమిచ్చింది. మరి వీల్‌చైర్‌ని వాడుతున్నావెందుకనే వారి చులకన ప్రశ్నకు సమాధానంగా.. అపరిశుభ్రతకు దూరంగా



ఉండేందుకని బదులిచ్చింది. జెన్నిఫర్ ఆత్మ విశ్వాసానికి స్నేహితులు ఆశ్చర్యపోయారు.

డొమినిక్‌కి ఏమౌతుంది..?

జెన్నిఫర్‌కి తన గతం గురించి కొంతే తెలుసు. ఆమె అసలు తల్లిదండ్రులెవరనే విషయాన్ని తన 16వ ఏట వరకూ తెలుసుకునేందుకు ప్రయత్నించలేదు. ఆ సందర్భంలో తనకి తెలిసిన ఒక నిజం ఆమెలో అలజడి సృష్టించింది. చిన్నతనం నుండి తను అభిమానించే క్రీడాకారిణి డొమినిక్ మొసియా మరెవరోకాదు. తన సొంత అక్క. అమెని పెంచిన గెరాల్డ్, షారన్‌ల నుండి ఈ నిజాన్ని తెలుసుకున్న జెన్నిఫర్ తన సోదరి డొమినిక్(30)కి 2007 డిసెంబర్‌లో ఒక లేఖతోపాటు తన చిన్ననాటి ఫొటోలు, తనని పెంచుకోడానికి జరిగిన ఒప్పంద పత్రాలను అమెకి పంపింది. ఆ సమాచారాన్ని అందుకునే దాకా డొమినిక్‌కి కూడా తనకో సోదరి ఉన్న సంగతి తెలీదు. జెన్నిఫర్ లేఖ అందుకున్నాక డొమినిక్‌కి అదో పిడుగుపాటు వార్త. తన తల్లిదండ్రులను ప్రశ్నించడంతో కొన్ని చేదు నిజాలు బయటపడ్డాయి. డొమినిక్ ఆరవ పుట్టిన రోజు వేడుక తర్వాత పుట్టింది జెన్నిఫర్. అంగవైకల్యంతో పుట్టిన ఆ పసికందు వైద్యం, పెంపకం అతని వల్ల కాని పనని తండ్రి డిమిట్రి అభిప్రాయపడ్డాడు. జెన్నిఫర్‌ని ఎవరికైనా దత్తత ఇవ్వాలంటూ భార్య కమెలియాని వత్తిడి చేశాడు. దీంతో పొత్తిళ్లలోని పసి పాపను కళ్లారా చూసుకోకుండానే అచేతనంగా తనకి దూరమయ్యానంటూ తల్లి కెమిలియా కన్నీటిపర్యంతమయ్యింది. తల్లిదండ్రులిద్దరూ జిమ్నాస్టిక్ క్రీడాకారులవడంతో డొమినిక్ మూడో ఏట నుండే ఆ క్రీడలో శిక్షణ ఇప్పించారు. ప్రపంచస్థాయి క్రీడాకారిణిగా ఎదిగిన డొమినిక్ కొన్ని కారణాల వల్ల తన 17వ ఏట చట్టపరంగా తల్లిదండ్రుల నుండి విడిపోయింది. కొన్నేళ్ల తర్వాత జెన్నిఫర్ బ్రికర్ రాసిన ఒక ఉత్తరం విడిపోయిన జిమ్నాస్టిక్ క్రీడాకారుల కుటుంబాన్ని ఒక్కటి చేసింది.

ప్రస్తుతం కాలిఫోర్నియాలో నివసిస్తున్న జెన్నిఫర్ ఎన్నో సాహసాలను చేస్తూ బ్రిట్నీ స్పియర్స్‌తో కలిసి ఎన్నో వేదికలను పంచుకుంది. మాటలో, చేతిరాతలో, నవ్వులో, ధైర్య సాహసాల్లో పోలికలు పంచుకున్న డొమినిక్, జెన్నిఫర్‌ల బంధం ఇప్పుడు మరింతగా బలపడింది. తన స్నేహితుడు తోటి ఆక్రోబాటర్ అయిన నేట్ క్రాఫర్డ్‌నే పెళ్లి చేసుకుని కాలిఫోర్నియాను విడిచి కన్నతల్లి కెమిలియాకు దగ్గరయ్యింది జెన్నిఫర్ బ్రికర్. ఇప్పుడు తనలాంటి వారికి ధైర్యానిస్తూ, స్ఫూర్తినిస్తూ అంతర్జాతీయ మోటివేషనల్ స్పీకర్‌గా మరెందరో వారి యుద్ధాల్లో విజేతలయ్యేందుకు కృషి చేస్తోంది.

- శర్వాణి

కార్టూన్ పంచ్



ఈ మెయిల్



వెంగళప్ప: రమేష్ నీ ఈ మెయిల్ పాస్‌వర్డ్ నాకు తెలిసిపోయింది.

రమేష్: ఔనా..... ఏంటో చెప్పు.....కంగారుగా అడిగాడు.

వెంగళప్ప: ఐదు స్టార్లు

కనిపించడం లేదు..!



భిక్షగాడు: బాబూ! ధర్మం చేయండి. గుడ్డివాణ్ని.

వెంగళప్ప : నీకు కళ్లు లేవని ఎలా నమ్మాలి?

భిక్షగాడు: అక్కడ చెట్టు కింద ముగ్గురు కూర్చొని ఉన్నారు. మీకు కనిపించారా?

వెంగళప్ప: ఆ.. అవును

భిక్షగాడు: మరి నాకు కనిపించడం లేదు

వెంగళప్ప: అయ్యో పాపం! ఇదిగో వంద...!

పెళ్ళి పిలుపు



ఆనందరావు : ఏరా పెళ్లికి ఎవరెవర్ని పిలిచావ్?

వెంగళప్ప: అందర్నీ పిలిచా నాన్నా మిమ్మల్ని తప్ప..

ఆనందరావు: ఏ నేనేం చేశాను...కోపంగా అడిగాడు

వెంగళప్ప: మీ పెళ్ళికి నన్ను పిలిచారేంటీ?

ఉద్యోగం ఇవ్వలా...



"నా కాండక్ట్ మంచిదని సర్టిఫికెట్ పెట్టినా ఉద్యోగం ఇవ్వలేదురా..! అన్నాడు రాజేష్ దీనంగా.

" ఇంతకూ ఆ సర్టిఫికేట్ ఎవరిచ్చారేమిటి...? అడిగాడు గిరీశం.

"ప్రొఫెషనల్ దొంగలు వాళ్ళు...!

కడుపు మంట



భార్య: ఏమండి నాకు కడుపులో మంటగా ఉంది.

భర్త: ఎప్పటి నుంచి?

భార్య: ఎదురింటావిడ మెడలో నెక్లెస్ చూసినప్పటి నుంచి.

ఐస్ క్రీం

చింటూ: అమ్మా ఒక పావలా ఇవ్వవా?

అమ్మ: ఎందుకు?

చింటూ: అక్కడ ఒక ముసలాయనా పాపం ఎండలో ఇందాకటి నుంచి అరుస్తున్నాడు?

చింటూ: ఐస్ క్రీం....ఐస్ క్రీం అని...

అమ్మ: ఆఆ......

రెండూ ఒకటేగా..



సుమన్ ....! నీకు లెక్కల్లో ఎందుకు తక్కువ మార్కులొచ్చాయి? ప్రొగ్రెస్ కార్డు చూస్తూ అడిగాడు తండ్రి.

" టీచర్ రెండు మూళ్లెంత అని అడిగింది. ఆరు అని చెప్పాను.

తర్వాత మూడు రెళ్ళెంతా అని అడిగింది..." చెప్పాడు సుమన్.

"రెండు లెక్కలకీ తేడా ఏముంది? మళ్ళీ అడిగాడు తండ్రి.

"అదే...నేనూ టీచర్‌ని అడిగాను".



సై-ఫై వైద్యం



మనుషుల్లాంటి రోబోలు తిరిగే కాలం ఇంకెంతో దూరంలో లేదని అంటున్నారు. కానీ మెడికల్ టెక్నాలజీలోని విప్లవం రాను రాను మనిషిని రోబోలా మార్చేస్తోందా అనిపిస్తోంది ఇటీవలి ఆవిష్కరణలు, జరుగుతోన్న ప్రయోగాలు చూస్తుంటే. మన కాన్షియస్‌ను ఓ కంప్యూటర్‌లోకి డౌన్‌లోడ్ చేసుకోవడమనేది ఊహ కాదని కొందరు శాస్త్రవేత్తలు నిరూపించి షాక్‌కు గురిచేశారు. రక్తం నుంచి మెదడు వరకు ఇప్పుడు సాంకేతిక పరికరాలతో బయోనిక్ దశకు చేరుకుంటోంది టెక్నాలజీ. ఏది ఆర్టిఫిషియల్ ఇంటెల్లిజెన్సో, మానవ మేధో చెప్పలేని దశకు చేరుకుంటోంది శాస్త్ర సాంకేతిక రంగం. ఇదే గనుక జరిగితే వైద్య రంగం సైన్స్ ఫిక్షన్‌ను తలపిస్తుంది. ఇప్పటికే మెడికల్ టెక్నాలజీ ఊహాతీతమైన విషయాల్ని నిజం చేస్తోంది. ఈ సై-ఫై వైద్యం గురించే ఈ వారం అట్ట మీది కథ.

డా॥ కాకర్లమూడి విజయ్

ఒకప్పుడు శరీరానికి కోత లేకుండా లోపలి భాగాల్ని చూడటం ఫిక్షనే. కానీ ఎక్స్‌రేలు, ఎమ్మారైలు, సీటీ స్కాన్‌లు వచ్చేశాయి. నోటిలో థర్మామీటర్ పెడితేనే జ్వరం ఎంతుందో తెలిసేది. కానీ ఇప్పుడు నుదుటికి కూడా తగిలించాల్సిన అవసరం లేని నాన్ కాంటాక్ట్ డిజిటల్ థర్మామీటర్లు వచ్చేశాయి. ఇవన్నీ మనం రోజు చూస్తున్నవి, తెలిసినవి. కానీ మెడికల్ టెక్నాలజీ ఇక్కడితో ఆగిపోలేదు. చిన్న చిన్న శస్త్ర చికిత్సలు చేసే రోబోల నుంచి రక్తంలోకి చేరి శుభ్రపరిచే సూక్ష్మమైన నానోబోట్‌ల వరకు సాంకేతికాభివృద్ధి పరుగులు పెడుతోంది. ఏదో సైన్స్ ఫిక్షన్ సినిమాలో చూసిన విధంగా మెడికల్ టెక్నాలజీలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. కొన్ని ఏళ్ల క్రితం కేవలం ఊహ అని కొట్టి పారేసినవే ఇప్పుడు జనం మధ్యలోకి వచ్చేశాయి. 3-డి ప్రింటింగ్ కృత్రిమ అవయవాలు, ఏకంగా ఒకరి తల ఒకరికి మార్చేసిన శస్త్ర చికిత్సలు, మనిషి మెదడుకు అనుసంధానం చేసిన బయెనిక్ ప్రొస్తెటిక్‌లు, శరీరంలోని ముఖ్యమైన అవయవాల పనితీరుపై ఎప్పటికప్పుడు సమాచారాన్నందించే వేరబుల్ రీడర్లు.. ఇలా మొత్తం వైద్య ప్రపంచాన్నే సాంకేతికతో ఊహాతీతంగా మార్చేస్తున్నాయి.క్యాన్సర్ వంటి రోగాలకు సైతం త్వరలో చెక్ పెట్టే సాంకేతికను

అందుకోబోతున్నాం. టెస్ట్ ట్యూబ్ బేబీలు, క్లోన్‌లు సంగతి ఇప్పుడు పాతబడిపోయింది. స్టెమ్ సెల్ బ్యాంకులు, సూపర్ సైబోర్గ్ హ్యూమన్ల మాట ఎక్కువగా వినిపిస్తోంది.

ఎన్ని అవరోధాలున్నా ఎన్ని ఆటంకాలున్నా సరే, శాస్త్రీయ పరిజ్ఞానం, సాంకేతిక అభివృద్ధి నిరాటకంగా సాగుతూనే ఉంటుంది. అదే ధోరణి వైద్య రంగంలో కూడా కొనసాగుతోంది. ప్రాకృతిక జీవిలో కృత్రిమ భాగం ఏమిటా అని తొలి రోజుల్లో సందేహపడినా, ఇబ్బంది పడినా, ఇప్పుడు కృత్రిమంగా తయారు చేసే వీలు కలగచేసింది. ఒకప్పుడు ఊహగా, కలగా, ఆలోచనగా మాత్రమే ఉన్న అనేక భావనలు ఇప్పుడు వాస్తవంగా రూపుదిద్దుకుంటున్నాయి. విపరీతమైన సుడి గాలి ధాటికి ఏకంగా మనిషి యెగిరి చంద్రుడి మీద పడ్డట్టు జూల్స్ వెర్న్ ఊహ. ఆ తరువాత మానవుడు చంద్రుడి పైకి దిగడం వాస్తవం. అందుకు కారణం సాంకేతిక పరిజ్ఞానాన్ని తనకు అనుగుణంగా మార్చుకోవడంలో ఎప్పటికప్పుడు ఘన విజయాలఇన సాధిస్తున్న మానవుడి మేధ. మొన్నటి వరకూ గ్రహాలు ఆకాశంలో చుక్కలే. ఇప్పుడు త్వరలోనో వాటిపైనే మనిషి నివాసం చేసే వేలు వుంది. మొక్కలు ఎండలో తమ ఆకుల్లో వున్న 'క్లోరోఫిల్' అనే ఒక రసాయన పదార్థం సాయంతో తమ ఆహారాన్ని తామే తయారు చేసుకుంటాయి. ఒక వేళ మనం కూడా క్లోరోఫిల్ ఎలాగాలో మనలో నిక్షిప్తం చేసుకునే వీలు వుంటే.. మనకి ఆకలైనప్పుడు కాసేపు ఎండలో నిలబడి, కడుపు నింపుకుని రావచ్చు కదా!! అప్పుడు ఈ ఆకలి బాధలూ, కష్టాలూ వుండవు కదా!! ఇదో ఊహ. ఇప్పుడు మాత్రమే ఇది ఆశ. రేపు నిజం కావచ్చు కూడా.

ఊహలెన్నో నిజాలయ్యాయి

మూత్ర పిండాలు రక్తాన్ని వడకట్టడంలో విఫలమైతే ఆ ప్రక్రియని శరీరం బయటే 'డయాలసిస్' పేరుతో చేస్తున్నాం. రక్త నాళాలలో ఏదైనా అడ్డుపడి ఇబ్బంది కలిగిస్తుంటే వాటిలో స్టెంట్‌లు అమరుస్తున్నారు. హృదయంలో కవాటాలు పనిచేయకపోతే కృత్రిమ కవాటాలు అమర్చడం ఇప్పుడు మామూలైపోయింది. ఆధునిక వైద్య విధానాల్లో సాంకేతిక విజ్ఞానం పెను పాత్ర పోషిస్తుంది. ఒకప్పుడు ఎక్స్‌రే మాత్రమే వుంటే ఇప్పుడు శరీర అంతర్భాగాలని స్పష్టంగా బయటనుండే చూసే వీలు ఇప్పటి హైటెక్ ఇమేజింగ్ సాధనాలతో వీలైంది. శస్త్ర చికిత్సలు కూడా కేవలం వైద్యుడి నైపుణ్యం పైనే కాకుండా లేజర్‌లు, రోబోలు, కంప్యూటర్‌లపై ఆధారపడుతున్నాయి. దెబ్బ తిన్న అవయవాలకు సాయంగా ఉండటానికి అసలు పూర్తిగా పాడైన వాటికి బదులుగా పనిచేయడానికి ఇప్పుడు దాదాపు అన్ని అవయవాలు కృత్రిమంగా అందుబాటులో ఉన్నాయి. అగ్ని ప్రమాదాల్లో చర్మం కోల్పోతే ఇప్పుడు కృత్రిమ చర్మం తొడగవచ్చు. కంటిలో శుక్లం వస్తే కరిగించవచ్చు. విరిగిన ఎముకలకు బదులు లోహాలు అమరుస్తున్నారు. కాలేయాన్ని అంటగడుతున్నారు.

మానవ మేధస్సుకు సాంకేతిక పరిజ్ఞానం తోడైతే అందుకోలేని అవధులు బహుశ అరుదేమో! మానవ ఆవిర్భావం నుండి ఇప్పటి వరకూ అనేకానేక ఆవిష్కరణలు ఇందుకు నిదర్శనంగా వున్నాయి. మనం కూడా జంతువులమే అయినా, మనల్ని ఇతర జంతువుల నుండి వేరు చేసేది కారణం కొరకు వెదికే మన మేధ. అదే మనలను కొత్తగా ఆలోచించడానికీ, కొత్తవి కనిపెట్టడానికి

విశ్లేషించడానికీ, సృష్టించడానికి మూలం. ఆ కారణంగానే మానవుడు మెరుగైన ప్రపంచాన్ని సృష్టించుకున్నాడు. ఉన్నదాన్ని మరింత మెరుగు పరుచుకుంటున్నాడు కూడా.. మానవ సాంకేతిక పరిజ్ఞానం అనేక రంగాలలో నిలదొక్కుకుంది. వైద్య రంగంలో అయితే ప్రకంపనలనే సృష్టిస్తోంది. కంటి చుక్కలు వేస్తే చాలు కరిగిపోయే కాటరాక్ట్ నుండి తెగిన అవయవాలను ముద్రించి అమర్చే సాంకేతిక వరకూ అద్భుతాలను అందించింది. ఇక ప్రాణాంతకమైన వ్యాధులను చూసే దృష్టి మారబోతుంది. డయాబెటీస్ తద్వారా వచ్చే గుండె పోటు, స్ట్రోక్, అంధత్వము, మూత్రపిండాల సమస్యలు, అవయవాల తొలగింపు వంటి వాటికి కొత్త మందులు రూపొందించడం లేదా సర్జరీ చేసి సమస్య తగ్గించడం ఇప్పుడున్న మార్గాలు. అయితే మందుల వల్ల సమస్య తగ్గడం అటుంచి కొత్త సమస్యలు తలెత్తడం కూడా ఒక సమస్యే. ఉదాహరణకు మధుమేహానికి వాడే ఒక మందు వల్ల బరువు పెరగడం, కాలేయం పనిచేయకపోవడం వంటి ఇతర ఇబ్బందులు కలుగుతాయని తెలిసింది. కాటరాక్ట్‌కు సర్జరీ మాత్రమే సరైన మార్గం.. కానీ దాని వల్ల కూడా సమస్యలు రాక మానవు. ఒకవేళ కత్తులతో కాకుండా మందులతోనే కాటరాక్ట్‌ని రూపు మాపితే? డయాబెటీస్ రాకముందే దానిని రాకుండా చేసే విధానం తెలిస్తే! అసలు సమస్య ఉన్న అవయవాన్ని తీసేసి కొత్త భాగాన్ని అమర్చగలిగితే? రానున్న రోజులలో ఇటువంటి ఊహాత్మక ఆశలను నిజాలుగా చూసే అవకాశం ఎక్కువగా కనిపిస్తోంది. ఇటీవల రూపొందిన కొన్ని ఆవిష్కరణలు ఇందుకు సందేహమెందుకు అంటున్నాయి.

తెలివిగల ప్రాస్తెటిక్‌లు

రోబోటిక్స్ ఇప్పుడు వైద్య రంగంలో పెనుమార్పులు తెస్తోంది. వికలాంగులకు వాడే కృత్రిమ అవయవాలు మనకి కొత్త కాదు కానీ,

ఇంతవరకూ వాడే కృత్రిమ అవయవాలు కేవలం ఆకారం మాత్రమే ఇచ్చేవి... పనితనం కాదు. ఇప్పుడు రోబోటిక్స్ సాయంతో నిజంగా నిజమైన అవయవాల లాగే పనిచేయగల

అవయవాలను తయారు చేసి అమర్చే వీలు కలిగింది. తాజాగా తయారయ్యే ప్రొస్తెటిక్‌లు అసలైన శరీర భాగాల కంటే మెరుగ్గా పనిచెయ్యగలవు. అవి సున్నితమైన నాడీ సంకేతాలకు సమర్థవంతంగా ప్రతిస్పందించగలవు. కాలిఫోర్నియా యూనివర్సిటీలో బ్రెయిన్-మెషీన్ ఇంటర్ఫేస్ వ్యవస్థ రూపొందింది. దీని ద్వారా మెదడులోని విద్యుత్ సంకేతాలను గ్రహించి కంప్యూటర్ ద్వారా వాటిని డీ-కోడ్ చేయవచ్చు. దీని ఆధారంగా మెదడు నుండి తీగెలను కాలి కండరాలకు అనుసంధానం చేసి, కాళ్ళను పనిచేయించవచ్చు. ఈ మొత్తం ప్రక్రియలో వెన్నుపూస అవసరం లేదు! అంటే వెన్నుపూస

దెబ్బతిన్న వారికి అవయవాలు సక్రమంగా పనిచేయించవచ్చు. చక్కగా నడిపించవచ్చు కూడా. ఇది ఇంకా తొలి దశల్లోనే వున్నా కచ్చితంగా సత్ఫలితాలనే ఆశించవచ్చు.

రెండో చర్మం, కణజాలం

మరో చోట కృత్రిమ చర్మాన్ని రూపొందిస్తున్నారు. దానిలో అనేక సెన్సార్‌లను అమర్చి, చేతి వేళ్ళ స్పర్శను కూడా గుర్తించగల విధంగా రూపొందించారు. స్టాన్ఫోర్డ్ విశ్వవిద్యాలయంలో కార్బన్ నానో ట్యూబ్‌లను చర్మంలో అమర్చి వాటి ద్వారా పీడనాన్ని గుర్తించి తగు విధంగా స్పందించగలదు కూడా. అయితే

ఇప్పటి వరకూ ఈ పరిశోధనలు ఎలుక మెదడుపై జరిగాయి.ఉత్తర కరోలీనాలో పరిశోధకులు గాయాలని మాన్పే విధంగా చర్మంపై కణాలను ముద్రించవచ్చని చెబుతున్నారు. ఈ విధానంలో కృత్రిమ కణాలు ఎక్కువ కాలం సజీవంగా ఉండవు. కానీ ఇందుకు మరో టెక్నాలజీతో పరిష్కారం కనుగొంటున్నారు. ఇప్పటికే

కృత్రిమ హృదయం

మన దేశంలో కృత్రిమ హృదయం తయారు చేశారు. కానీ ఈ గుండె మరో వ్యక్తి ద్వారా దానం చేయబడ్డ గుండె దొరికే వరకూ దెబ్బ తిన్న గుండెకు తోడుగా ఉంచుతారు. కొంత మందికి అసలు గుండె ట్రాన్స్ ప్లాంట్ చేయడం కూడా కష్టం కావచ్చు. అటువంటి సమయాల్లో ఈ కత్రిమ గుండె తప్ప మరో మార్గం లేదు. ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా 10,000కు పైగా హృద్రోగ గ్రస్తులు కత్రిమ గుండెతో జీవిస్తున్నారు.

రక్తంలో సూక్ష్మ రోబోలు

మన రక్తంలో సూక్ష్మ స్థాయిలో వుండే 'నానోబాట్' లు అనబడే రోబోలను ప్రవేశపెట్టి వాటి ద్వారా అనేక పనులు చేయించవచ్చని అంటున్నారు. ఈ సూక్ష్మ రోబోలు పూర్తి స్థాయి రోబోల లాగే పనిచేస్తాయి. మామూలు మందుల కంటే మరింత శక్తివంతమైన మందులను వీటి ద్వారా శరీరానికి అందించవచ్చు. ఈ నానోబాట్‌లు బాక్టీరియాని నిర్మూలించడానికి, గాయాల సమయంలో రక్తం త్వరగా గడ్డ కట్టడానికి కణాలని రిపేరు చేయడానికి ఉపయోగించవచ్చు.

స్టెంట్ రెట్రీవర్

మెదడు రక్త నాళాలలోని గడ్డ స్ట్రోక్‌కి కారణం కావచ్చు. గడ్డ తొలగించడం ఆలస్యం అయితే మెదడు దెబ్బతినడం మరణం కూడా సంభవించవచ్చు. రక్తపు గడ్డ తొలగించడానికి ఇప్పటి వరకూ వున్న ప్రక్రియ అంత సత్ఫలితాలను ఇవ్వడం లేదు. ఇప్పుడు సూక్ష్మ పరికరాన్ని రక్తనాళాలలోకి పంపిస్తే అది రక్తపు గడ్డని వెదికి పట్టుకుని దాన్ని తొలగిస్తుంది. దాంతో పేషెంట్ వేగంగా కోలుకుంటాడు.

వాడుకలో ఉన్న 3-డి ముద్రణ పరిజ్ఞానాన్ని ఇందుకోసం వాడుతున్నారు. కణజాలంలా మారే పదార్థం, నీటి ఆధారిత సిరా వాడి కణాలనీ వాటి మధ్య ప్రాణ వాయువు, పోషకాలు ప్రవహించే విధంగా చేస్తున్నారు. ఇలా రూపొందిన కణజాలాన్ని సురక్షితంగా శరీరాలలో అమర్చవచ్చు. ఈ దిశలో మొదటి విజయం మానవ చెవులు ఎలుకల చర్మం కింద అమర్చడం. రెండు నెలలో కొత్తగా అమర్చిన కణజాలం రక్త నాళాలని అభివృద్ధి చేసుకుంది. ఈ మొత్తం ప్రక్రియ ఇంకా కొన్ని పరీక్షలకి గురైన తరువాత మానవులపై ప్రయోగించవచ్చు.

టైమ్‌కు మందులు

మామూలుగా అయితే ఆరోగ్య సమస్యకో మందు చొప్పున వేసుకోవాలి. పైగా కొన్ని మందులు కొందరికి పడవు. అయితే ముద్రణ విధానాన్ని మరో విధంగా వాడుకోవచ్చు. వివిధ ఔషధాలను కలిపి ఒకే గుళికగా తయారు చేసి ఏ మందు ఎప్పుడు విడుదల కావాలో ముందుగానే నిర్ధారించవచ్చు. అంటే మందులు పడని వారు ప్రత్యేక సమస్యలు, అలర్జీలు, వ్యాధులు ఉన్న వారు తమకు అనువైన విధంగా ప్రత్యేకంగా సైడ్ ఎఫెక్ట్‌లు లేని మందులను పొందవచ్చు.

మధు మేహాన్ని ముందే పసిగట్టే..

ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం రెండేళ్ళ క్రితం ప్రపంచవ్యాప్తంగా నలభై రెండు కోట్ల మందికి మధుమేహం వ్యాధి ఉంది. అందులో యాభై శాతం మంది చైనా, ఇండియా, ఇండోనేషియా, బ్రెజిల్, అమెరికాలో ఉన్నారు. మధుమేహానికి సాధారణ కారణం ఇన్సులిన్ అనే హార్మోన్ సరిగ్గా పనిచేయకపోవడం. స్థూల కాయం, శరీర వ్యాయామం లోపం కూడా డయాబెటిస్ కలిగించడానికి కారణం అవుతాయనేది కొందరి వాదన. మరో పక్క అధికంగా చక్కెర పదార్థాలను తీసుకోవడం.. ముఖ్యంగా పట్టణీకరణ మూలంగా వచ్చిన జంక్‌ఫుడ్ వల్ల కూడా డయాబెటిస్ వచ్చే అవకాశాలు ఎక్కువ అనే వాళ్ళున్నారు. కారణం ఏదైనా మధుమేహాన్ని ముందస్తుగా గుర్తించడం వల్ల మేలు కలుగుతుంది. ఇతర సమస్యలు చిక్కబడకుండా అది తెలుసుకోవడానికి రసాయనాలను శరీరంలోకి పంపితే అవి ముందే చక్కెర మోతాదులను గుర్తించి సూచిస్తాయి. అందుకు తగ్గట్టుగా ముందుగానే మందులను వాడుకోవచ్చు.

కరిగే కాటరాక్ట్‌లు

ఈనాటికీ కంటి చూపు పోగొట్టే కాటరాక్ట్ సమస్యకు సరైన మందులేదు. ప్రస్తుతం మబ్బులా మారిన కంటి కటకాన్ని సర్జరీ ద్వారా తొలగించి మరో కృత్రిమ కటకాన్ని అమర్చడం ఒక్కటే పరిష్కారం. అమెరికా శాస్త్రవేత్తలు మాత్రం మరో పరిష్కారం కనుగొన్నారు. కంటిలో వేసే చుక్కలు శుక్లాన్ని కరిగించి స్పష్టమైన చూపుని ఇస్తాయి. లానోస్టెరాల్ అనే సహజమైన స్టెరాయిడ్‌ని వాడి కంటి కటకాలను కరిగించవచ్చని వాళ్ళు అంటున్నారు. లానోస్టెరాల్ శుక్ల పరిమాణాన్ని తగ్గించడమే కాకుండా అది మళ్ళీ రాకుండా అడ్డుకుంటుంది. లానోస్టెరాల్ బహుళ కాంతి ప్రసరణకు అడ్డు తగిలే ప్రోటీన్ ని ఆపుతుందని అనుకుంటున్నారు.

సూపర్ బగ్‌కు క్వాంటం డాట్‌లు

ఏదైనా ఇన్ఫెక్షన్ కలిగితే సాధారణంగా మనం యాంటిబయాటిక్‌లు వాడతాం. అతిగా యాంటి బయాటిక్‌లు వాడటం మూలంగా వ్యాధికారక క్రిములు శక్తివంతంగా మారి, మరోసారి యాంటీ బయాటిక్‌లకి లొంగకుండా మారతాయి. ఇటువంటి యాంటీ బయాటిక్‌లకి లొంగని క్రిముల్ని సూపర్ బగ్‌లు అంటున్నారు. క్రమ క్రమంగా అతి సాధారణ క్రిములు కూడా అతి శక్తివంతంగా మారి ప్రాణాంతకం కావచ్చని హెచ్చరికలు వచ్చాయి. మరి ఈ విపత్తుకి ఎటువంటి పరిష్కారం లేదా అంటే ఉందనే అంటున్నారు పరిశోధకులు. సూక్ష్మ జీవులను ఇంకా సూక్ష్మమైన పదార్థాలతో ఎదుర్కొనవచ్చని తెలిసింది. కాంతికి ప్రభావితమయ్యే నానో పదార్థాలను క్వాంటం డాట్‌లు అంటారు. ఇవి మానవ వెంట్రుక కన్నా 20,000 రెట్లు సూక్ష్మంగా ఉంటాయి. వీటిని ఉపయోగించి పరిశోధనాలయంలో దాదాపు 92 శాతం యాంటీ బయాటిక్‌ని ప్రతిఘటించే బాక్టీరియాని విజయవంతంగా నిర్మూలించారు. ఇంతకు ముందు కూడా ఇటువంటి నానో పదార్థాలు యాంటీబయాటిక్‌ను ప్రతిఘటించే బాక్టీరియాని నిర్మూలించడంలో వాడినా, అవి ఇతర ఆరోగ్యకరమైన కణాలను కూడా దెబ్బ తీసేవి. కానీ క్వాంటం డాట్‌లు చీకటిలో క్రియా రహితంగా వుండి కాంతిలో క్రియాత్మకంగా మారతాయి. కాంతి తరంగ దైర్ఘ్యం మార్చి ఇన్ఫెక్షన్‌లను నిర్మూలించవచ్చు.



గాయానికి జెల్‌తో పూత

లండోలీనా, మిల్లర్ అనే ఇద్దరు శాస్త్రవేత్తలు వేటి-జెల్ అనే పదార్థం కనుగొన్నారు. ఈ వేటి-జెల్ శరీరంపై గాయాన్ని క్షణాల్లో మూసేస్తుంది. ఈ అద్భుత పదార్థం నిజమైన కణజాలంలాగే ఒక పొరను ఏర్పరిచి రక్తం గడ్డకట్టేలా చేసి, గాయాన్ని మూస్తుంది. ఈ పదార్థం యుద్ధభూముల్లో అత్యవసర పరిస్థితుల్లో అద్భుతంగా పనికొస్తోంది. బుల్లెట్ గాయాల వల్ల తీవ్రంగా రక్తం పోయి చనిపోయేవారి సంఖ్యే యుద్ధ క్షేత్రాల్లో ఎక్కువ. గాయపడిన వారిని సకాలంలో (గోల్డెన్ అవర్) వెంటనే వైద్యం అందిస్తే చాలా ప్రాణాలు కాపాడబడతాయి. వేటి జెల్ వల్ల గోల్డెన్ అవర్ నిడివి పెంచే అవకాశం కలుగుతోంది. దీన్ని తొలుత మిలటరీ అవసరాలకు వినియోగించారు. తర్వాత సామాన్య జనానికి కూడా ఉపయోగించేందుకు కొన్ని దేశాలు నిర్ణయం తీసుకున్నాయి. కుట్లు, గాట్లు సమస్యలకు ఇక కాలం చెల్లినట్టే. కాలిన గాయాల నుంచి కూడా కొంత ఉపశమనం కలగొచ్చు.

లెన్స్, పిల్స్‌లో పరీక్షలు

శరీరంలో గ్లూకోజ్‌ని కనిపెట్టే కాంటాక్ట్ లెన్సులను గూగుల్ రూపొందించింది. కన్నీరులో చక్కెరని ఇవి గుర్తిస్తాయి. అలాగే క్యాన్సర్‌ని కనిపెట్టే గుళికను కూడా తయారు చేసింది గూగుల్. ఆ గుళికలో అతి సూక్ష్మ అయస్కాంత రేణువులు ఉంటాయి. అవి క్యాన్సర్ కణాలకు అతుక్కుని చేతికి అమర్చుకున్న వాచ్‌పై ద్వారా తెలియచేస్తాయి.

రియల్ టైం డయాగ్నోస్టిక్స్

రాబోయే కాలంలో రియల్ టైం డయాగ్నోస్టిక్స్ పెద్ద పాత్ర వహించనున్నాయి. I knife విశ్లేషించి వివరాలను తెలుపుతుంది. దీని ద్వారా కణజాలంలో క్యాన్సర్ కణాలున్నాయో లేవో వెంటనే తేలిపోతుంది. పైగా ఆపరేషన్‌ల సమయాన్ని కూడా ఆదా చేస్తుంది.

వైద్య రంగంలో నాడి చూసే స్టెతస్కోప్‌తో మొదలైన మనం ఎక్స్‌రే నుండి అనేక స్కాన్‌ల వరకూ చాలా దూరం వచ్చాం. అవన్నీ సరైన సమస్యని పట్టుకోవడానికి తద్వారా సరైన వైద్యం అందించడానికి సాయ పడుతున్నాయి. సాంకేతికత మన జీవితాలను సునాయాసంగా, ఆరోగ్యకరంగా దీర్ఘాయువుతో గడిపేందుకు దోహదపడుతోంది. ఇప్పటికే శస్త్ర చికిత్సలు సులభంగా, వేగంగా, సునాయాసంగా చేసే పద్ధతులు వెసులు బాటు అందుబాటులో ఉన్నాయి. కృత్రిమ దంతాలు, కృత్రిమ నేత్రాలు, విరిగిన ఎముకల నుంచి కృత్రిమ చర్మాలు, కృత్రిమ హృదయ కవాటాలూ, స్టెంట్‌లో ఇలా చాలా వరకు సాంకేతిక ఆధార వైద్యం జరుగుతోంది.

సంతానం లేని వారి కొరకు కృత్రిమ గర్భధారణ పద్ధతులు బహు ప్రాచుర్యం పొందాయి. ఇంతకు మునుపు వినని ప్రక్రియలు ఇప్పుడు తెలుసు. ఉదాహరణకి గర్భంలో ఉన్న శిశువు మూల కణాలను తీసి వాటిని నిక్షిప్తం చేయడం. అందు వలన రేపటి రోజు వారికి అవయవాల అవసరత ఏర్పడితే వారి మూల కణాల నుండే కొత్త అవయవాలను రూపొందించవచ్చు. మొత్తానికి కొత్త సాంకేతికత మానవ జాతికి దిశని, సరికొత్త దశని అందించవచ్చు. ఇటువంటి అద్భుతాలను వాస్తవాలుగా చేయడానికి బిలియన్‌లు వెచ్చించేందుకు ధనవంతులు వ్యాపారులు ఉన్నారు. ఆ ఫలాలను చూసి మానవ మేధను మెచ్చుకునేందుకు మనమూ ఉన్నాము. కానీ అందులో సామాన్య మానవుడికి అందేది ఎంత అనేది మాత్రం ఆ టెక్నాలజీకి కూడా తెలియదు.



మన రాత మనమే రాసుకోవచ్చు, దిద్దుకోవచ్చు

విశ్వరహస్యాలను ఛేదించడానికి, అవగాహన పెంచుకోడానికి, అర్థం చేసుకోడానికి మన ప్రయత్నాలు అపారం. అటువంటి ప్రయత్నాలలో మహోన్నతమైనదని భావించేది హ్యూమన్ జీనోమ్ ప్రాజెక్ట్. ఏ ఇద్దరు మనుషుల జీనోమ్‌లను పరిగణనలోకి తీసుకున్నా, అవి 99 శాతం ఒకే తీరుగా ఉంటాయి. అయితే, మిగిలిన ఆ చిన్న వ్యత్యాసమే అతి ముఖ్యమైనది. ఆ వ్యత్యాసమే (డిఎన్ఏలోని వ్యత్యాసాలు) మనలో ఒక్కొక్కరు ఒక్కొక్క విధంగా విశిష్టంగా, విభిన్నంగా ఏర్పడేందుకు కారణం. మన కనుముక్కు తీరు, లేక వ్యాధులకు లోబడే ఆరోగ్య తీరు నుండి మందులకు స్పందించే లక్షణం వరకు ఆ చిన్న వ్యత్యాసమే మూలం అన్నమాట. ఈ వివరాల ద్వారా, మానవులకు వారసత్వంగా సంక్రమించే వ్యాధుల మూలకారణాలు ఏమిటో తెలుసుకునే వీలు కలుగుతుంది. కారణాలు తెలిసిన పిదప వాటిని నివారించడం సాధ్యపడుతుంది. అంతేకాక, జన్యువులలో ఏమైనా మార్పులు సంభవించే అవకాశాలను ముందుగానే పసిగట్టే వీలు కూడా కలుగుతుంది. ప్రస్తుతం పడిన పునాదితో రాబోయే కాలంలో మనకు కావలసిన జన్యు లక్షణాలతో బిడ్డలను పొందవచ్చు. మానవ జీవిత కాలాన్ని మరింత పెంచవచ్చు కూడా

కామ్రా ఇన్లే కార్నియాల్ ఇంప్లాంట్

దగ్గరి వస్తువులను సరిగా చూడలేని రీడింగ్ గ్లాసులని వాడుతూ ఇబ్బంది పడే వారి కోసం ఇప్పుడు ఒక కొత్త ప్రక్రియ రాబోతోంది. కామ్రా ఇన్లే కార్నియాల్ ఇంప్లాంట్ అనే ఒక వస్తువుని కంటిలో అమర్చితే దగ్గరి వస్తువులు స్పష్టంగా చూసే వీలు కలుగుతుంది. ఇప్పటికే ఈ ఇంప్లాంట్ యాభై దేశాలలో అందుబాటులో ఉంది.

స్థూల కాయాన్ని తగ్గించే ఎలక్ట్రానిక్ పిల్

అమెరికాలో మేల్కాప్ సిస్టమ్స్ అనే సంస్థ ఒక పిల్‌ని రూపొందించింది. దానిని మామూలు టాబ్లెట్‌లా మింగాలి. అది జీర్ణాశయంలోకి వెళ్ళి అక్కడ నీటిని పీల్చుకుని వ్యాకోచిస్తుంది. దానిపై వుండే అయస్కాంత పరికరం ద్వారా స్మార్ట్‌ఫోన్‌కి సంధానం చేసి జీర్ణాశయాన్ని ఉత్తేజపరచవచ్చు. దాంతో జీర్ణాశయం ఇక ఎక్కువ ఆహారం వద్దు అనే సంకేతాన్ని మెదడుకి అందజేస్తుంది. తద్వారా అధిక ఆహారం, అధిక కాలరీలు, అధిక బరువు వుండవు. మూడు వారాల తరువాత పిల్ సహజంగానే శరీరం బయటకు వెళ్ళిపోతుంది. ప్రస్తుతం ఇంకా ప్రయోగ దశలోనే ఉన్నా ఈ పిల్ ప్రపంచవ్యాప్తంగా కోట్ల సంఖ్యలో ఉన్న స్థూలకాయులకు వరమే!

✦

బయో మెడికల్ బనీను

బనీను లాంటి పరికరాన్ని 250 ఎలక్ట్రోడ్‌లు అమర్చి రూపొందించారు. వాటి సాయంతో గుండె వేగం ఇతర అంశాలు క్షుణ్ణంగా తెలుసుకోవచ్చు. ఏ ప్రదేశంలో సమస్య వుందో కూడా తెలుసుకోవచ్చు. ఈ కొత్త బయో మెడికల్ బనీనుతో రోగి పరీక్ష సులభతరం అవుతుంది. చికిత్స సరిగ్గా వేగంగా జరిగే అవకాశం ఉంది.



సూది రహిత గ్లూకోజ్ పరీక్ష

డయాబెటీస్ ఉన్న వారు నిత్యం ఇంజెక్షన్‌తో రక్తాన్ని తీసి పరీక్షించుకోవడం పెద్ద తలనొప్పి. కొత్తగా రూపొందించిన బయో సెన్సార్ పాచ్‌ని చర్మంపై వేసుకుంటే చాలు. అది వెంటనే రక్తం పరీక్షించి ఫలితాలని తెలియ చేస్తుంది. ఈ పరికరం పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే మధుమేహంతో బాధపడే వారికి రక్త పరీక్షల బాధ తప్పుతుంది.

ఎపిలెప్సీకి పరిష్కారం

మూర్ఛ రోగానికి చికిత్స చేసేలా ఇప్పుడు చర్మం కింద నిక్షిప్తం చేయగల పరికరం రానుంది. అది మూర్ఛ వచ్చే ముందే సంకేతాలను పసిగట్టి మెదడుకి అవసరమైన సంకేతాలను పంపుతుంది. ఫలితంగా మెదడు మూర్ఛ రాకుండా ఆపుతుంది.





'బంగారు' భిక్షువు

బౌద్ధ భిక్షువు మరణిస్తే ఆయన గుర్తుగా ఏదో ఒక ఆనవాలు మిగుల్చుకుంటారు. నైరుతి చైనాలోని కాంగ్‌ఫూ ఆలయంలో ఫుహు (94) అనే భిక్షువు నాలుగేళ్ల క్రితం మరణించారు. తన శరీరాన్ని మట్టిలో కలపకుండా భద్రపరచాలనేది ఆయన చివరి కోరిక. మరణానంతరం ఈజిప్టు మమ్మీల తరహాలో ఆయన భౌతిక కాయాన్ని భద్రపరిచారు. ఒక పెద్ద మట్టి కుండీలో పొడి బొగ్గు, గంధపు చెక్కల్ని ఉంచి చెమ్మ చేరకుండా ఫుహు శరీరాన్ని అందులో కూర్చున్న విధంగా ఉంచి గట్టి మూతతో భద్రపరిచారు. నాలుగేళ్ల తర్వాత ఒక ప్రత్యేక ఉత్సవం రోజు జార్ మూత తీసి చూశారు. ఫుహు శరీరం ఏమాత్రం పాడవకపోవడంతో శుభ్రపరిచి ఒక పల్చటి గుడ్డతో కప్పి దానిపై బంగారపు పూతపోయించారు. అలా ఓ బంగారు విగ్రహంగా మలిచారు. దీన్ని దొంగలు చొరబడలేని ఒక అద్దాల పెట్టెలో పెట్టి డాంగ్‌డాన్ ఆలయంలో సందర్శనకు ఉంచారు.

మ్యావ్.. మ్యావ్ తర్జుమా



పిల్లుల అరుపులు, ఏడుపు ఇలా రకరకాల శబ్దాల తాలూకు భావం ఏమిటో తెలియజేసే ఒక పరికరాన్ని రూపొందించింది ఆడమ్ అండ్ ఈవ్ సంస్థ. పిల్లుల మ్యావ్ శబ్దాలని మనుషుల మాటల్లోకి అనువదించే 'క్యాటర్‌బాక్స్' దాని పేరు. పిల్లుల మెడ భాగంలో అమర్చే ఈ పరికరంలో పిల్లులకు సంబంధించిన కొన్ని మ్యావ్ శబ్దాలను ముందుగానే లోడ్ చేస్తారు. ఈ పరికరంలో అమర్చిన డిజిటల్ సెన్సార్లు పిల్లులు అరచినపుడల్లా వాటి శబ్దాన్ని మనుషులకు అర్థమయ్యే భాషలోకి అనువదిస్తాయి. ప్రపంచంలో పిల్లుల అరపులను అనువదించిన తొలి పరికరం కూడా ఇదే. కొన్ని పిల్లుల గోలకు ఇంకా అలవాటు పడలేదని క్యాటర్ బాక్స్‌కు మరిన్ని మెరుగులు దిద్దే పనిలో ఉన్నారు రూపకర్తలు. పిల్లులు చేసే మరిన్ని శబ్దాలను గుర్తించి వాటిని కూడా మనుషులకు అర్థమయ్యే భాషలోకి అనువదించే పనిలో పడ్డారు పరిశోధకులు.

వింత లోకం

ఇంట్లోంచే వేట

చేపలు పట్టడమంటే కొందరికో సరదా. అమెరికాలోని ఒక్లాహోమాకి చెందిన పాల్ ఫిలిప్స్‌కి మాత్రం ఇదో వ్యసనం అయిపోయింది. రోజూ సరస్సు దగ్గరకి వెళ్లి మళ్లీ ఇంటికి రాలేక ఏకంగా అక్కడే ఇల్లు కట్టేసుకున్నాడు. ఇంట్లోనే రహస్యంగా చేపలు పట్టుకునే ఒక ప్రదేశాన్ని నిర్మించుకున్నాడు. చేపలు పట్టేందుకు రహస్య మార్గం ఎందుకంటే....ఊలోగాహ్ సరస్సు వద్ద ప్రశాంతంగా ఓరోజు చేపలు పడుతున్నాడు ఫిలిప్స్. ఇంతలో ఒక వ్యక్తి వచ్చి ఇక్కడ చేపలు పట్టకూడదంటూ అడ్డుకున్నాడు. దీంతో చిర్రెత్తుకొచ్చింది ఫిలిప్స్‌కి. ఇంట్లోనే చేపలు పట్టుకునే వీలుంటే ఎవరూ ఇబ్బంది పెట్టరని ఆలోచించాడు. సరస్సు ఒడ్డున ఏర్పరుచుకున్న ఫిలిప్స్ ఇంటి మూడు దిక్కుల నుండి కూడా చేపలు పట్టుకునే వీలుంది. అలాగే ఓ గది మధ్యలో ఏర్పాటు చేసిన అంతర్ద్వారం నుంచి కూడా చేపలు పట్టుకునేలా ప్లాన్ చేశాడు. ప్రస్తుతం ఈ ఇంటి నుంచి మారిపోయే ప్రయత్నంలో ఉన్నాడు. మరింత విశాలమైన ఇంటిలో పూటలు పూటలు చేపలు పడుతూ గడిపేందుకు ప్లాన్ వేస్తున్నాడు.



పదే పదే అదే పని

చేసిన పనే పదే పదే చేయాలంటే విసుగ్గా ఉంటుంది. కొందరు మాత్రం ఒకే పనిని చాలాసార్లు చేస్తుంటారు. దీన్నే ఓసిడి (అబ్సెసివ్ కంపల్సివ్ డిజార్డర్) అంటారు. చైనాకి చెందిన అమ్మాయి డెంగ్ మి (24) కూడా ఈ మానసిక సమస్యతో బాధ పడుతోంది. బాధ ఎందుకు ఉపాధిగా మార్చేసుకుంటే పోలా అనుకుంది. పనిలో బిజీ బిజీగా గడిపేస్తూ ఇంటిని శుభ్రంగా ఉంచుకోలేని మిలినీయర్ల వార్డ్ రోబ్ ఆర్గనైజర్‌గా మారింది డెంగ్ మి. చైనాలోని సిచుయాన్ ప్రాంతంలో సేల్స్ పర్సన్‌గా, ఫ్యాషన్ బొటిక్ నిర్వాహకురాలిగా ఇలా ఎన్నో వృత్తుల్ని నిర్వర్తించింది డెంగ్‌మి. చిన్న పిల్లల సంరక్షకురాలుగా ఓ బేబి సిట్టింగ్ సెంటర్‌ని నిర్వహిస్తున్నపుడు ఇంటిని పదే పదే శుభ్రం చేస్తుండేదట. ఈ అలవాటుని పసిగట్టిన ఓ మిత్రురాలు ఆమెన వార్డ్‌రోబ్ నిర్వాహకురాలుగా మారాలని సలహా ఇచ్చింది. 2014లో ఒక సంపన్నుల ఇంటిలో దుస్తులను చక్కగా అమర్చే పని చేపట్టింది డెంగ్ మి. ఇప్పుడు చాలామందికి సేవల్ని అందిస్తోంది. తనలాంటి వారి కోసం ఒక స్కూల్‌ని కూడా స్థాపించాలని అనుకుంటోంది. దుస్తులు, నిత్యావసరాలను అలమరాల్లో అందంగా ఎలా సర్దుకోవాలనే వాటిపై ఔత్సాహికులకు తర్ఫీదు ఇచ్చి పని కూడా కల్పిస్తానంటోంది.

హీరో మీద ప్రతినాయకుడిదే పైచేయి అవ్వాలన్నట్టుగా పాత్ర ఉంటే దానికి న్యాయం చేసే నటుడు ఎవరంటే అర్జున్ రామ్‌పాల్ అని చెప్పొచ్చు. విలనీలో అతడిదో హీరోయిజం. ఓ చిత్రంలో హీరోగా విలన్‌లకు అస్సలు చాన్సే ఇవ్వడు. ఇంకో సినిమాలో కేరెక్టర్ ఆర్టిస్ట్‌గా హీరోకు సమాంతర ప్రాధాన్యతను లాగేసుకుంటాడు. ఇలా విలక్షణ విలనీ హీరో రామ్‌పాల్. కింది స్థాయి నుంచి ఎదిగిన రియల్ హీరో ఇతను.


అర్జున్ రామ్‌పాల్

స్టార్

విలనీ హీరో

- అర్జున్ రామ్‌పాల్ 1972 నవంబర్ 26న మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో జన్మించాడు. సైనిక కుటుంబానికి చెందిన నేపథ్యం. తాతయ్య (అమ్మ తండ్రి) బ్రిగేడియర్ గార్డియల్ సింగ్ స్వాతంత్ర్యానంతరం ఆర్మీ కోసం ఫిరంగీని డిజైన్ చేశారు.
- ఈయన తాతయ్య పంజాబీ. నానమ్మ మాత్రం డచ్ దేశస్తురాలు. వారి కుటుంబంతో విడిపోయిన తర్వాత రామ్‌పాల్ తన తల్లి వద్దే పెరిగాడు. ఆవిడ సెయింట్ పాట్రిక్ స్కూల్‌లో ఉపాధ్యాయురాలుగా పనిచేసేవారు.
- 1998లో మెహ్రా జేసియతో రామ్‌పాల్‌కు వివాహమైంది. మెహ్రా మంచి మోడల్, మాజీ మిస్ ఇండియా కూడా. వీరికి ఇద్దరు కూతుళ్లు.
- రామ్‌పాల్ తొలుత బుల్లి తెరపై అలరించాడు. ఇలా ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ సినిమా రంగంలోకి ప్రవేశించాడు. కష్టాలను అధిగమించి స్టార్‌గా ఎదిగాడు. రామ్‌పాల్ నటుడే కాదు నిర్మాత కూడా.
- అశోక్ మెహతా దర్శకత్వంలో రూపొందిన 'మోక్ష' రామ్‌పాల్ మొదటి చిత్రం. మనీషా కొయిరాల, ఈయన హీరో హీరోయిన్లు. ఈ చిత్రం కొన్ని కారణాల వల్ల విడుదల కాలేదు.
- 2001లో రాజీవ్ రాయ్ దర్శకత్వంలో చేసిన 'ప్యార్ ఇష్క్ ఔర్ మొహబ్బత్' చిత్రం ద్వారా చిత్రసీమకు పరిచయమయ్యాడు. తర్వాత 'మోక్ష' సినిమా విడుదలైంది.
- 'ప్యార్ ఇష్క్ ఔర్ మొహబ్బత్'లో మోడల్‌గా చేస్తూ నాయకుడిని ఎదురించే ప్రతినాయకుడు పాత్ర చేశాడు.
- ఆయన దేనితో అయితే కెరీర్‌ను ప్రారంభించాడో ఆ పాత్రలోనే తన మొదటి చిత్రంలో నటించే అవకాశం దక్కింది. అలా చాలా చక్కగా ఆ పాత్రలో ఒదిగిపోయే అవకాశం వచ్చిందనే చెప్పాలి. అందుకే ఆ సినిమాలో రామ్‌పాల్ నటనకు విమర్శకుల నుంచి ప్రశంసలు లభించాయి.
- తన జీవితంలో అర్జున్ ప్రతిభకు నిదర్శనంగా ఆ పాత్ర నిలిచిపోతుందని సినీ విమర్శకుడు తరాన్ ఆదర్శ్ ఎఫ్ఎం అప్పట్లోనే అభివర్ణించడం విశేషం.
- రెండో చిత్రంలో పేరుపొందిన వ్యాపారవేత్తగా, నిజమైన ప్రేమికుడిగా 2002లో 'దిల్ హై తుమ్హారా'లో ఒదిగిపోయాడు. చేసింది ద్వితీయ చిత్రమే అయినా సుదీర్ఘమైన అనుభవం ఉన్న నటుడిలా మెప్పించగలిగాడు.
- భావోద్వేగాలతో కూడిన సన్నివేశాలను తన మొదటి చిత్రంలోనే ఎంతో అద్భుతంగా చేశాడు. అదే ఇండస్ట్రీలో హీరోను చేసింది.
- హీరోగా చేసే అవకాశం 2003లో వచ్చింది. 'మోక్ష' చిత్రం మినహాయిస్తే అప్పటి వరకూ సహాయ నటుడిగా కొనసాగాడు. 'దిల్ కా రిస్తా' చిత్రమే రామ్‌పాల్ హీరోగా చేసిన తొలి సినిమా.
- ఇక అక్కడ నుంచి యాక్షన్ థ్రిల్లర్లు చేసుకుంటూ పోయాడు. 'డాన్' చిత్రంతో నటనలో మరింత పురోగతిని సాధించాడు. షారుఖ్‌తో కలసి చేసిన ఓం శాంతి ఓం, తర్వాత రాక్ ఆన్, హౌస్‌ఫుల్, రా.వన్ వంటి హిట్ చిత్రాలు ఆయన ఖాతాలో ఉన్నాయి.
- 'ఆంఖే'లో అంధుడి పాత్రతో విశేషమైన గుర్తింపు లభించింది. 'రాక్ ఆన్' నటనకు జాతీయ ఉత్తమ సహాయ నటుడిగా అవార్డు వరించింది.
- దిల్ హై తుమ్హారా, దిల్ కా రిస్తా, అసంభవ్, యకీన్, డాన్, ఓం శాంతి ఓం, రాక్ ఆన్, హౌస్‌ఫుల్, రా.వన్ చిత్రాలకు గాను 2002 నుంచి వరుసగా 2011 వరకూ ఆయన నటనకు ఏదో ఒక విభాగంలో అవార్డులు వరించాయి.
- చేజింగ్ గణేష్ ఫిల్మ్ పేరిట ఆయన ప్రొడక్షన్ హౌస్‌ను ప్రారంభించి మొదట సారిగా 2006లో 'ఐ సీ యు' సినిమాను నిర్మించాడు. ఈ చిత్రంలో ఈయనే హీరో కూడా. ఇతర వ్యాపారాలు కూడా రామ్‌పాల్‌కు ఉన్నాయి. సినిమాల్లో విలన్‌గా రాక్షసమైన పాత్రలు చేసినా వాస్తవంగా ఈయన జంతు ప్రేమి కుడు. పీపుల్ ఫర్ ఎథిక్ ట్రీట్‌మెంట్ ఆఫ్ యానిమల్స్(పెటా)లో సభ్యుడు కూడా.
- రేఖ, ప్రీతి జింటా, ప్రియాంకా చోప్రా, ఐశ్వర్యరాయ్, అమీషా పటేల్ వంటి హీరోయిన్లు ఈయన సినిమాల్లో చేశారు. కథానాయిక కిమి శర్మ ఈయనకు బంధువు.
- హృతిక్ చేసిన 'లక్ష్య' చిత్రంలో చేసే ఆఫర్ మొదట అర్జున్ రామ్‌పాల్‌కే వచ్చింది. కాని కొన్ని కారణాల వల్ల దాంట్లో ఈయన నటించలేదు.
- ఈ మధ్యే విడుదలై విమర్శకు మన్ననలు అందుకున్న రాయ్ చిత్రంలో రామ్‌పాల్ నటించిన పాత్రలో ఇంకెవరినీ ఊహించలేం.
- త్వరలో ఆయన శ్రద్ధా కపూర్‌తో కలసి 'రాక్ ఆన్' సీక్వెల్‌లో చేయనున్నారు.

- కొప్పుశెట్టి దేవరాజు

ఒంటరిగా ప్రపంచాన్ని చుట్టొచ్చాడు మన విశాఖ వాసి భరద్వాజ దయాల. ఒక్కడే ఓ బైక్ మీద భూగోళంపై గిరగిరా తిరిగేశాడు. తొలి భారతీయుడిగా ఇదో రికార్డు. కానీ ఈ రికార్డు కన్నా విలువైంది ఆయన దృష్టిలో వేరే ఉంది. ఓ ఊరు, ఓ పేరు, ఓ ప్రాంతం, ఓ జాతి ఇలా హద్దుల్ని చెరుపుకుంటూ ఖండాల సరిహద్దుల్ని దాటేస్తూ ప్రపంచాన్ని చూశాడు. రోడ్డు మార్గంలో చూసిన ఈ ప్రపంచాన్ని మళ్లీ ఆకాశ మార్గంలో, సముద్ర మార్గంలో ఒంటరిగా చుట్టి రావాలనే పెద్ద సాహసాన్ని తలపెట్టాడు. కొన్ని రోజుల్లో మడగాస్కర్‌కు ఒక్కడే నౌక నడపాలని ఏర్పాట్లు చేసుకుంటున్నాడు.

సాహసమే శ్వాసగా..

VANDE MAATARAM ride for a cause

సాహసాలు అభిరుచి అనేకంటే సాహసమే ఊపిరి భరద్వాజకు. అందుకే ఓ సాహస ప్రపంచ యాత్ర చేసినా మరో యాత్రకు సిద్ధమవుతున్నాడు. లేకుంటే డేర్ డెవిల్‌కు ఊపిరాడుతుందా. జీవితం అనిపిస్తుందా. చైనా గోడ మీద నడిచేశాడు. హిమాలయాల్లో ఒంటరిగా ట్రెకింగ్ చేశాడు. అఘోరాలతో కలసి గడిపాడు. టర్కీలో ఏకాంత క్యాంపు వేశాడు. ఆర్కిటిక్ సర్కిల్‌లో మంచు దారుల్లో సుదూర రైడ్‌ల్ని చేశాడు. న్యూజిల్యాండ్‌లో ఓ క్యాంపర్‌వ్యాన్‌లో క్రాస్ వేశాడు. అక్కడే బంగీ జంప్‌తో ఆనందంగా ఎగిరి గంతేశాడు. థాయ్‌ల్యాండ్‌లో పర్వతారోహణతో సంతోషపు గుట్టనెక్కాడు. అమెరికాలో డర్ట్ బైక్‌తో చక్కర్లు కొట్టాడు. నాస్కార్ ట్రాక్‌లో దూసుకుపోయాడు. హాట్ ఎయిర్ బెలూన్‌లో ఈజిప్ట్ అందాల్ని తిలకించాడు. ఎర్ర సముద్రంలో స్కూబా డైవ్ చేశాడు. సంతోషపు ఆనుపానులు వెతుక్కుంటూ 5000 మీటర్ల జంప్ చేశాడు, ప్యారా గ్లైడింగ్‌తో మబ్బుల్ని తాకాడు. తానో స్వాప్నికుడంటాడు భరద్వాజ్. తన కలల్ని ఎలా చేధించుకోవాలో బాగా తెలుసంటాడు. అలుపెరగని పోరాటం, అలవి కాని ప్రయత్నమంటాడు. తానో ట్రెకర్, సెయిలర్, పైలట్... ఇంకా తానో వరల్డ్ రైడర్ అని గర్వంగా చెప్పుకుంటాడు.

ట్రెకింగ్, ప్యారా గ్లైడింగ్ అన్నీ చూశాక ఈ సాహసి దృష్టి సుదూర యాత్రలపై పడింది. అలా ప్రపంచ యాత్రకు ప్రయాణం కట్టేశాడు. బైక్‌పై వేల మైళ్ల సుదీర్ఘ ప్రయాణం. ఒంటరిగా మొదలైన ఈ ప్రయాణంలో ఎన్నో అడ్డంకులు. బైక్‌పై ప్రపంచాన్ని చుట్టిరావాలనే ఆయన దృఢ సంకల్పం ముందు ఈ అవరోధాలన్నీ చిన్నబోయాయి. కేవలం 18 నెలల్లో 5 ఖండాలు, 14 దేశాలను బైక్‌పై చుట్టొచ్చిన తొలి భారతీయుడిగా రికార్డు నెలకొల్పాడు. ఇంకా చెప్పాలంటే ఇలా చేసిన మరో భారతీయుడు లేడు. ఒంటరిగా 47 వేల మైళ్లు ప్రయాణించడమంటే అదో మిషన్ ఇంపాజిబులే. కరాటేలో బ్లాక్ బెల్ట్ సాధించిన భరద్వాజకు ఆత్మరక్షణ భయం లేదు. ఎలాంటి సందర్భంలోనూ భయానికి గురికాని భరద్వాజ్‌ను ఒక్క విషయం మాత్రం ఆలోచనలో పడేసింది. సుదూర ప్రయాణానికి బైక్ సహకరిస్తుందో లేదోనని. అయినా విదేశీ బైక్‌లేవీ ఎంచుకోలేదు. దేశీయ కరిజ్మా బైక్‌తోనే తన ప్రయాణాన్ని సాగించాడు. 2006 అక్టోబర్ 2న విశాఖపట్టణం నుంచి బయలుదేరాడు. చెన్నయ్, తిరుపతి, హైద్రాబాద్, పూనె నగరాల్ని చుడుతూ ముంబైకి చేరుకున్నాడు. అక్కడి నుండి తన ప్రయాణం ఇరాన్ రాజధాని టెహరాన్ దిశగా సాగింది. ఇరాన్ నుంచి అంతర్జాతీయ రహదారుల మీదుగా ఇరాక్, టర్కీ, సిరియా, జోర్డాన్, ఈజిప్ట్, గ్రీస్, ఇటలీ, ఫ్రాన్స్, రష్యా, కెనడా, అమెరికా, ఆస్ట్రేలియా, ఇండోనేషియా, బంగ్లాదేశ్ వంటి దేశాలన్నిటినీ చుట్టబెట్టాడు.

తొలి ప్రపంచ యాత్ర..

తొలి ప్రపంచ యాత్రలో ఎన్నో సవాళ్లు ఎదురయ్యాయి. ఒక్కో దేశం చేరుకోడానికి ఆ దేశపు అనుమతి కలిగుండాలి. వెళ్లే ప్రతి దేశానికి పాస్‌పోర్ట్ పర్మిషన్లు, ఆపై చెకింగ్ ఇదంతా ఓ పెద్ద ప్రక్రియ. వివిధ దేశాల్లో లభించే ఆహారం, విశ్రాంతి తీసుకునేందుకు అనువైన ప్రదేశాన్ని ఎంచుకోవడం ఇలా చాలా విషయాల్లో భరద్వాజకు ఇబ్బందులు ఎదురయ్యాయి. కొన్ని దేశాల్లో ప్రవేశించేందుకు వీసా తదితర విషయాల్లో సమస్యల్ని ఎదుర్కోవాల్సి వచ్చింది. ముందుగా ప్లానింగ్ చేసుకున్నా తొలి మజిలీలో అడ్డంకులు తప్పలేదు. ఎన్ని సమస్యలు వచ్చినా ఎప్పుడూ వెనుదిరగలేదు. ఒక్కో దేశంలోకి అడుగు పెట్టే కొద్దీ రెట్టించిన ఉత్సాహంతో ముందడుగు వేసేవాడు. వివిధ దేశాలకు బైక్‌పైనే చేరుకుని ఎన్నో దేశాల అధికారుల మన్ననలు పొందాడు. తొలి బ్రేక్‌లో ప్రపంచంలోని వివిధ ఖండాలు, దేశాలను దాటుకుంటూ 2007 అక్టోబర్ 2న యాత్ర పూర్తిచేశాడు. పట్టుదల ముందు ఎలాంటి సమస్యలైనా చిన్నవిగా కనిపిస్తాయని రుజువుచేశాడు. ప్రపంచం మొత్తాన్ని వీక్షించాలనే కోరిక తనలో మరింతగా బలపడింది. పబ్లిసిటీతో ఆయనకు పనిలేదు. తెలిసిందల్లా అనుకున్నది సాధించడం ఒక్కటే! ప్రయాణం కొనసాగిన 18 నెలల్లో కుటుంబానికి సంబంధించిన జ్ఞాపకాలు ముప్పిరిగొనేవి. వెనక్కు మళ్లాలని మనసు లాగేస్తున్నా తనను తానే ధైర్యం తెచ్చుకునేవాడు. కొన్ని సార్లు వైద్యులు ఇక ప్రయాణం మంచిది కాదని వారించినా తన సంకల్పం వదలలేదు. చేరుకునే ప్రదేశాల్లోని వాతావరణ వివరాలు, రూట్ మ్యాప్‌లు, ఆహారం, గ్రామస్తుల తీరు తదితర విషయాల సమాచారం ముందుగానే తెలుసుకుని తగిన జాగ్రత్తలు తీసుకుంటూ ప్రయాణం ముందుకు సాగించేవాడు. అప్పటికి స్పాన్సర్స్ సాయం కూడా లేదు. కొద్దిపాటి డబ్బుతోనే ప్రయాణం ముగించుకుని స్వదేశానికి తిరిగొచ్చాడు. ఆ ఘట్టం అతనికో ధీరుడిగా, దేశం గర్వించే సాహసిగా గుర్తింపు తెచ్చింది.

ప్రేరణగా..

డేర్ డెవిల్‌గా ఈ సుదీర్ఘ ప్రయాణం ఎంతోమంది సాహసికుల్ని ఆయన అభిమానులుగా మార్చింది. తర్వాత మరికొంతమంది బైక్ రైడర్లతో కలిసి భరద్వాజ్ ఎన్నో సాహస యాత్రలు చేశాడు. మిగతావారికి ప్రేరణగా నిలిచాడు. వాటిలో కొన్ని మాత్రమే మీడియా చిత్రీకరణకి సాధ్యపడ్డాయి. ఎన్ని ప్రయాణాలు చేసినా మరో కొత్త ప్రయాణాన్ని ప్లాన్ చేయడంలో తలమునకలవుతుంటాడు భరద్వాజ్. వివిధ దేశాల్ని తనలానే బైక్‌పై చుట్టొచ్చేయాలనుకునే వారి కోసం రైడ్ ది వరల్డ్ అనే పుస్తకాన్ని కూడా రచించాడు. వివిధ దేశాల మధ్య మంచి సంబంధాలు ఏర్పడేలా ఆయన చేస్తున్న బైక్ యాత్రని మెచ్చుకుంటూ దుబాయ్ అధినేత ఆయన కుమారుడు మన్సూర్ బిన్ మొహమ్మద్ ఇరువురి చేతుల మీదుగా 2013 డిసెంబర్ 4న ప్రశంసా పురస్కారాన్ని ఇచ్చారు. ప్రపంచ రైడ్‌లపై పట్టు సాధించిన ఆయన వైజాగ్‌లోని బ్రేవ్‌హార్ట్స్ యూత్ క్లబ్‌లో బోట్ నడపడం, కొండలు ఎక్కడం వంటి సాహస క్రీడల్లో ఔత్సాహికులకు శిక్షణ ఇస్తున్నాడు. హిమాలయాలపై ట్రెకింగ్‌ని పూర్తి చేసిన భరద్వాజ్ ట్రెకింగ్‌పై అవగాహనా సదస్సులని నిర్వహిస్తుంటాడు. ఖాళీ సమయాల్లో శిక్షణ ఇచ్చే కార్యక్రమాలు కూడా చేపడుతుంటాడు. ఎప్పటికప్పుడు కొత్త రైడ్‌లకు కసరత్తులు చేసుకుంటుండే 'డ్రీమ్ లైవ్' అనే పేరుతో బైక్‌పై తన రెండో ప్రయాణాన్ని 2014లో మొదలు పెట్టాడు. అప్పటికే ఆయనో లెజెండ్. మీడియాతో పాటు స్పాన్సర్ల దృష్టినీ ఆకర్షించాడు. ఓ ప్రపంచ యాత్రకు అత్యంత ప్రతిభాశీలురైన పన్నెండు మంది బైక్ రైడర్లని ఎంపికచేసే బాధ్యతని కూడా ఓ సంస్థ కోసం నిర్వర్తించారు భరద్వాజ్.







బాధ్యతగా..

కేవలం తన వ్యక్తిగత థ్రిల్, సంతృప్తి కోసం ఆయన సాహసాలు, యాత్రలు చేస్తున్నారంటే పొరబడినట్టే. తన సాహసోపేత జీవితాన్ని సామాజిక సేవకూ అంకితం చేశాడు. తనలాంటి సాహసికులకు మార్గదర్శనం చేస్తూనే, సరైన బాట పట్టిస్తూనే ఇతర సామాజిక విషయాల్లోను యువతను చైతన్యం చేస్తున్నారు. బైక్ రైడ్‌లని యువత ఎక్కువగా ఇష్టపడుతుంటారు. రయ్...రయ్..మంటూ విపరీతమైన వేగంతో ఎలా పడితే అలా బైక్ రేసులు పెట్టుకుంటూ చాలా మంది ప్రమాదాలకి గురవుతున్నారు. అలాంటి యువతను చైతన్య పరిచేందుకు ఆయన ఒక బైకర్స్ టీమ్‌ని ఏర్పాటు చేశాడు. రోడ్డు భద్రత పట్ల యువతకి అవగాహన కల్పించేందుకు తన టీమ్‌తో కలిసి బైక్‌రైడింగ్‌పై ఎన్నో అవగాహనా కార్యక్రమాలను ఆయన చేపట్టాడు. యువత అధిక సంఖ్యలో ఎన్నికల్లో పాల్గొనాలనే ఉద్దేశంతో వందేమాతరం అనే పేరుతో ఒక బైకర్ ఉద్యమాన్ని నిర్వహించాడు. యువత ఓటు హక్కును వినియోగించుకోవాలంటూ 2014లో దేశంలోని 29 రాష్ట్రాల్లో తన బృందంతో కలిసి బైక్ యాత్రలు చేసిన సందర్భంలో ఆయన చేసిన ప్రసంగాలు యువతలో మార్పుకి దోహదపడ్డాయి. బాలికా విద్య, ఆడపిల్లల సంరక్షణ విషయాలపై సేవ్ ది గర్ల్ చైల్డ్ వంటి స్వచ్ఛంద సంస్థలతో కలిసి పనిచేస్తున్నారు. ఇలా ఉంటుందా ఓ డేర్ డెవిల్ జీవిత యాత్ర అని ఆశ్చర్యపడేలా భరద్వాజ్ సాహసాల గమ్యం వైపు సాగుతున్నాడు. ఆ గమ్యం ఇంకెన్ని ప్రపంచయాత్రల్ని చూస్తుందో. ఇంకెందరినీ ఆయన మార్గం పట్టిస్తుందో. సాహసం శ్వాసగా సాగిపో సోదరా..

జూకామల్లి... ఓ కవితాఝరి!

'జూకామల్లి'... పేరులోనే ఓ నాజూకుతనం వుంది. అదే నాజూకుతనం, భావుకత, భాషా సౌందర్యం, సున్నిత హాస్యం, కాసింత రొమాన్స్ అన్నీ కలగలిపిన కథనశైలి కె.బి.లక్ష్మి గారి 'జూకామల్లి' కథల సంపుటి. జూకామల్లి రచయిత్రికి రెండో కథల పుస్తకం. చాలా వరకు జీవితానుభవంలో నుంచి తీసుకున్న వాస్తవ సంఘటనలకు సజీవ రూపం ఈ కథలు. ఈ పుస్తకంలో 21 కథలున్నాయి. అన్ని కథలూ దేనికదే వైవిధ్యభరితంగా చక్కని రచనా శైలితో ఆకట్టుకుంటాయి. ఈ పుస్తకానికి పెట్టిన జూకామల్లి పేరే ఇందులోని 17వ కథ శీర్షిక. ఈ కథ మొత్తం ఓ కవితాఝరిలా సాగుతుంది. వికలాంగురాలైన మోహనకు బతుకుపై ధీమానిచ్చిన తండ్రి, ధీరగా భావించిన కృష్ణ ఇద్దరూ రెండు కళ్లు. వర్షంలో రిక్షాలో వెళుతున్న మోహనను చూసి, ఓ కవిత లాంటి ఉత్తరాన్ని ఆమె చేతిలో పెడతాడు. ఆ ఉత్తరాన్ని తల్లిదండ్రులకిస్తుంది. ఫలితంగా కృష్ణతో మాట్లాడతారు. మోహనకు పిల్లలు పుట్టరని ఆమె తండ్రి చెప్పినా, తన చేయి నాకందిస్తే జీవనబాటలో పక్కనుండి నడిపిస్తానని ఆమె చేయందుకుంటాడు కృష్ణ.

మరో కథ... 'జనని'. ఈ పుస్తకంలోని మొదటి కథ. చాలా మామూలుగా మొదలై... హృద్యంగా ముగుస్తుంది. మనసును మెలిపెడుతుంది. వీరేశం, సావిత్రి దంపతుల గారాలపట్టి జనని. సావిత్రి ఏరికోరి పెడుతుందా పేరు తన కూతురికి. చక్కగా సాగిపోయే వారి జీవితంలో ఓ కుదుపు. వీరేశానికి ఒక కిడ్నీ పాడైపోవడంతో ఆపరేషన్ చేసి తీసేస్తారు. ఐదేళ్లకి రెండోది కూడా చెడిపోయిందని తెలుస్తుంది. ఏదో తాత్కాలిక వైద్యంతో రోజులు గడుపుకొస్తుంటారు. జనని ఐదో పుట్టినరోజు తమ ఇంటివద్ద చేస్తామని సావిత్రి అన్న సదాశివ తమ ఊరు తీసుకెళతాడు. అక్కడ అనుకోకుండా జరిగిన యాక్సిడెంట్‌లో వారి కుమార్తె జనని చనిపోతుంది. ఆమె కిడ్నీని

జూకామల్లి
రచయిత: కే బీ లక్ష్మి
పేజీలు : 184
ధర : రూ.140
ప్రతుల కోసం : స్నేహాని కుంజ్ ప్రచురణ, నవోదయ బుక్‌హౌస్ హైదరాబాద్.

తండ్రి వీరేశంకు అమర్చుతారు. ఈ కథా క్రమం చెప్పిన తీరు హృద్యంగా వుంటుంది.

మరో కథ 'ఊరు మారినా... ఉనికి మారునా..'. ప్రపంచీకరణ మొదలై... పట్టణీకరణ పెరిగిన తర్వాత పల్లెల రూపు రేఖలు మారిపోతున్నాయి. అప్పటివరకూ పల్లెల్లో సుఖంగా వున్నవారు ఒక్కసారిగా తమ ఉనికిని కోల్పోయి, ఉపాధికోసం పట్టణాలకు చేరుకోవడం, మరోవైపు చదువుకుని ఉద్యోగాలకోసం పట్టణాలకు చేరడం. అదే సమయంలో పల్లెటూరులో కామందు, గంగిరెద్దు గోపన్న మధ్య పెద్ద అంతరం... పట్టణంలోకి వచ్చేసరికి ఇద్దరూ ఒక్కటై పక్కపక్కనే కూర్చొని బోలెడు కబుర్లు చెప్పుకుంటారు. తరాల అంతరాలను... ముఖ్యంగా జగన్నాథం పాత్ర చిత్రణ సహజాతి సహజంగా అక్షరీకరించారు రచయిత్రి.

అలాగే సమీక్ష.. సాహిత్య కార్యక్రమాల్లో పుస్తక సమీక్షలపై సున్నితమైన హాస్యంతో ఆసక్తికరంగా వుంటుందీ కథ. అలాగే మిగతా కథలు, వాటి శీర్షికలు కూడా ఆసక్తికరంగా వుంటాయి. 'అమ్మ అన్నది..?' కథ కూడా పేరుకు తగ్గట్టు అందంగా వుంటుంది. వాసంతి వాళ్ల ఇంటికి ఓ సేల్స్‌మన్. మామూలుగానే సేల్స్‌మన్‌ల వృత్తి పట్ల కాస్త సాఫ్ట్‌కార్నర్ ఉన్న వాసంతి... చిన్నవి ఏవోకటి కొంటూ వుంటుంది. అలాగే వచ్చిన సేల్స్‌మన్ విశ్వనాథ్. అతని అలసటను గమనించిన వాసంతి టిఫిన్ చేయమని పెడుతుంది. దానికే సంబరపడిపోయిన విశ్వనాథ్ తన గురించి మొత్తం చెబుతాడు. బెంగాల్ నుంచి వచ్చానని, డబ్బు సంపాదించి ప్రయోజకుడిగా తన తల్లి ముందు నిలవాలనుకుంటున్నానని చెబుతాడు. అప్పుడప్పుడు కలుస్తానని చెప్పి వెళ్లిపోతాడు. మధ్యమధ్య ఫోన్లు చేస్తుండేవాడు. ఆ తర్వాత చాలాకాలం గ్యాప్ వస్తుంది. అకస్మాత్తుగా ఒకరోజు వాసంతి వాళ్ల ఇంటికొచ్చిన విశ్వనాథ్.. "నే పెళ్లి చేసుకున్నాను ఇప్పట్లో బెంగాల్ వెళ్లి అమ్మను చూడలేను. అప్పటి వరకూ మీరే మా అమ్మ. మమ్మల్ని ఆశీర్వదించండి" అంటూ అనంత్, వాసంతిలకు పాదాభివందనం చేస్తాడు. మంచి ప్రేమానుబంధాలు వ్యక్తమయ్యే ఈ కథ చక్కని అనుభూతినిస్తుంది.

'పున్నాగ' చక్కని సందేశంతో కూడుకున్న కథ. హెచ్ఐవి బారిన పడి విచ్ఛిన్నమై పోయిన ఓ కుటుంబం, తన తప్పు లేకపోయినా భర్త వదిలేయడంతో అనాథగా మారిన భార్యా, కుమార్తె. హెచ్ఐవి అపోహలపై నిర్వహించిన ఒక కార్యక్రమంలో నిజం తెలుసుకొని తన భార్య, కుమార్తెను అక్కున చేర్చుకుని తన తప్పు దిద్దుకున్న భర్త. చక్కని శైలితో కవితాత్మకమైన వాక్యాలతో చదువరులను ఆకట్టుకుంటారు రచయిత్రి.

అలా.. ఈ పుస్తకంలోని అన్ని కథలూ ఒక్కో ప్రత్యేకమైన కథాంశంతో విలక్షణంగా రాశారు. ఎక్కడా అసహజత్వం గోచరించదు. "శ్రమైక జీవన సౌందర్యానికి ఖరీదు కడుతూ, మెట్టుమెట్టూ ఎక్కుతూ, కలాన్ని ఝుళిపిస్తూ, అక్షరక్షరాన్ని చెక్కుతూ, ప్రత్యేక కంఠస్వరాన్ని వినిపిస్తూ నిలబడినవేళ ఎంత శిల్పాన్వితమీ మనుగడ. అనిపించే కథా కుసుమాలివి" అని రచయిత్రి తన మాటలో చెప్పినట్టుగానే ఈ కథలన్నింటిలోనే తనదైన కంఠస్వరాన్ని రచయిత్రి వినిపిస్తారు. ఈ పుస్తకాన్ని ప్రతి ఒక్కరూ చదవాచ్చు.

- రాజాబాబు కంచర్ల

రచయిత: డి.కె. చదువుల బాబు
వెల : 80/-
పేజీలు : 75/-
ప్రతులకు : రవీంద్ర తిలక్ పబ్లికేషన్స్, 3/528-2, వైఎంఆర్ కాలనీ, ప్రొద్దుటూరు, కడప

ఆహ్వానం

మీ కవితలు పంపాల్సిన చిరునామా:
స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ.-520002.
మెయిల్ అడ్రస్ : snehaweekly.praja@gmail.com

సామాజిక, ఆర్థిక మార్పులతోపాటు ప్రపంచవ్యాప్తంగా వివిధ ప్రదేశాల్లోని కుటుంబాల్లో స్థిరత్వాన్ని పెంచేందుకు మే 15న ప్రపంచ కుటుంబ దినోత్సవాన్ని ఐక్యరాజ్యసమితి నిర్వహిస్తోంది.

ప్రపంచవ్యాప్తంగా విడాకులు తీసుకున్న వారికి చెందిన పిల్లలు 15 శాతం మంది.

భారత్‌లో మారిన కొలువుల తీరుతో కుటుంబాలకు దూరంగా యువత పనిచేయాల్సి వస్తోంది. ఉద్యోగాల విషయంలోనే కాదు చదువుల విషయంలోను ఇంటికి దూరమవుతున్న విషయం నేటి తరపు కనిపించని తీవ్ర సమస్య.

మంచి సంభాషణలు, పాత ఆల్బమ్‌లు,కుటుంబ చరిత్రలు, జ్ఞాపకాలు, ఘటనలు ఇవన్నీ తరచూ ఉండాల్సిందే. అవే అందర్నీ కట్టిపడేస్తాయి.

పిల్లల ముందు భార్యాభర్తలు ఇరు తరపుల వారి గురించి కస్సుబుస్సులాడే బదులు ఒకరి గురించి మరొకరు గౌరవం చూపితే అదే పిల్లలకు అలవాటవుతుంది. కుటుంబం చాలా విలువైందని అర్థమవుతుంది.

తెలుసా

కుటుంబాలు బాగుండాలి

ఏడాదిలో అప్పుడప్పుడూ కుటుంబమంతా కలసి కొన్ని రోజుల పాటు విహారానికి వెళితే ఓ గొప్ప జట్టు తయారవుతున్నట్టే.

బడి నుంచి పిల్లలు రాగానే పెద్దలు చిరునవ్వుతో దగ్గరకు తీసుకోవడం, సరదాగా కాసేపు ముచ్చట్లాడటం, చిన్నారులను ఆడించడమనే విషయాలు కుటుంబానికి పిల్లలు ప్రాముఖ్యతనిచ్చేలా చేస్తుంది.



కుటుంబ సభ్యులు బాధలో ఉన్నా, సమస్యల్లో పడినా వెంటనే వారికి బాసటగా నిలవాలి. కుటుంబం అంటే బలహీనత కాదు బలం కావాలి.

ఎంత పని రాక్షసులైనా కూడా కాసేపు కుటుంబానికి సమయం కేటాయించాల్సిందే. లేకుంటే వారి మనసుల్లో సభ్యత్వం త్వరలోనే కోల్పోతారు.

ప్రేమను దాచుకోవడం కాదు తరచూ వ్యక్తం చేస్తుండాలి. విభేదాలు, చిన్న తగాదాల్ని పరిష్కరించుకోవడంలో ముందుండాలి. అవసరమైతే క్షమాపణలు చెప్పేందుకు వెనకాడగూడదు.

ఏదో భార్య, భర్త, తండ్రి, కొడుకు, తల్లీ కూతురు, అత్త మామలు ఇలా బంధాల్లా కాదు మంచి మిత్రులుగా ఒకరికొకరు తోడుంటే ఆ కుటుంబ అనుబంధం చాలా పటిష్టంగా ఉంటుంది.

దక్షిణాఫ్రికాలో కుటుంబ దినోత్సవ సందర్భంగా సెలవు ప్రకటిస్తారు.

(అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం సందర్భంగా..)



వోయ్నిచ్ గ్రంథం

ఏ గ్రంథాలలో..?

లియోనార్డో డావిన్సీ తాను సముపార్జించిన విజ్ఞానాన్నంతా ఓ కోడ్ భాషలో రాసుకునేవాడు. ఆయన గ్రంథాల్లోని రహస్యాలు ఛేదించేందుకు పరిశోధకులు చేయని ప్రయత్నాలు లేవు. చివరకు ఆయన గీసిన చిత్రాల్లోను ఏదో కోడ్ ఉందని కనిపెట్టారు. ఎంతో కొంత ఆయన జ్ఞానాన్ని వెలుగులోకి తేగలిగారు కానీ, ప్రపంచంలో ఇంకా గుట్టు ఛేధించలేని ఎన్నో గ్రంథాలున్నాయి. అంతుచిక్కని రహస్య సంకేతాలతో, చిత్రాలతో, లిపితో, శైలితో ఇవి పరిశోధకులకు సవాల్ విసురుతున్నాయి. వందల ఏళ్లుగా వీటి కోడ్‌ను డీకోడ్ చేయడంలో వేలాది ప్రయత్నాలు విఫలమవుతూనే ఉన్నాయి. వీటిలో కొన్ని ఇవే..

ప్రపంచంలోనే అత్యంత మార్మికమైన గ్రంథంగా పేరు తెచ్చుకున్న వోయ్నిచ్ పుస్తకాన్ని ఎవరు రాశారో తెలీదు గానీ 1912లో దీన్ని సేకరించిన విల్ఫ్రిడ్ ఎం.వోయ్నిచ్ పేరుతో దీన్ని పిలుస్తున్నారు. మొత్తం 240 పేజీలుండే ఈ పుస్తకాన్ని ఏ లిపిలో, ఏ భాషలో రాశారో తెలీడం లేదు. పుస్తకం నిండా చాలా కచ్చితత్త్వంతో గీసిన వర్ణ చిత్రాలు మనకు తెలీని వృక్ష సంపదకు సంబంధించినవని తెలుస్తోంది. వింత మొక్కలు, ఘటనలకు చెందిన చిత్రాలున్నాయి. ఇవన్నీ అసలు ఈ భూగ్రహానికి చెందినవేనా అనే అనుమానం కూడా కలుగుతోంది పరిశోధకులకు. ఎవరివో పిచ్చి చిత్రాలు, రాతలు అని కొట్టేయడానికి లేకుండా చిత్రాల్లోన్ని సిమ్మెట్రీ, సాపేక్షత, పోలికలు చూస్తుంటే దీన్ని లిపిని ఛేదిస్తే అద్భుతమైన లోకం తాలూకు వివరాలు తెలుస్తాయని, లేదా ఇవన్నీ ఓషధ రహస్యాలకు సంకేతాలని పరిశోధకులు దీని గుట్టు విప్పేందుకు పట్టు వదలకుండా ప్రయత్నిస్తున్నారు. ఎంతటి కఠినమైన కోడ్‌నైనా విప్పేయగల కోడెక్స్ నిపుణులు కూడా చేతులెత్తేశారు. ఈ పుస్తకం 1404-1438 మధ్య కాలంలో రాశారని కార్బన్ డేటింగ్ ద్వారా తెలిసింది. ఎడతెగని ప్రయత్నాల ద్వారా ఇదో పరుసవేది రచన అని ఓ అంగీకారానికి వచ్చారు. అప్పట్లో రసవేదం ద్వారా దేన్నుంచైనా బంగారాన్ని తయారుచేయాలని పరుసవేదులు ప్రయోగాలు చేసేవారు. చాలామంది ఇలా తమ పరిశోధనల్ని ఎవరికీ అంతుచిక్కకుండా రచించేవారు. అయితే ఇది గ్రహాంతరవాసులకు చెందిన జ్ఞానమనే వాదన కూడా ఉంది. ఎందుకంటే అనేక అంతరిక్ష ఘటనలకు చెందిన వివరాలు, రేఖాచిత్రాలు, ప్రాణుల ఊహాచిత్రాలు వేటినీ కూడా ఈ కాలంలోను ఎక్కడా చూసి ఎరిగింది లేదు. ఇవి కచ్చితంగా మరో లోకానికి చెందినవనే వాదన ఉంది. ఇది కచ్చితంగా బోగస్ కాదని చెప్పేందుకు ఈ గ్రంథం రచనకు వెచ్చించిన కాలం, ధనంతో పాటు డిటైల్స్ అన్ని కూడా ఇదో విలువైన పుస్తకమని చెబుతున్నాయి.

రిప్లీ తాళపత్రాలు

మీరు 'రిప్లీ బిలీవిట్ ఆర్ నాట్' అనే పుస్తకాన్నో, టీవీ కార్యక్రమాన్నో చూశారా? వింత వస్తువులు, ప్రాణులు, ఘటనలు, మనుషులకు సంబంధించిన ఆసక్తికరమైన వివరాలతో ఉంటాయవి. సర్ జార్జ్ రిప్లీ అనే పరుసవేది, తాత్త్వికుడు పేరిట ఇలాంటి వాటిని సేకరిస్తున్నారు. అమరత్వం రహస్య శోధనకు 20 ఏళ్లు యూరప్‌లో తిరిగిన రిప్లీనే ఓ గ్రంథం రాస్తే అదెంత విస్మయకర విషయాలతో ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. 1477లో ఇంగ్లండ్‌కు వచ్చిన రిప్లీ... మాల్టా, రోడ్స్ వీరులు టర్క్స్‌తో యుద్ధం చేసేందుకు కావాల్సిన బంగారాన్ని అందించాడని చరిత్ర చెబుతోంది. అంత బంగారాన్ని ఓ సాధువు ఎలా సంపాదించాడనేదో పెద్ద ప్రశ్న. పరుసవేది విద్య ద్వారానే ఇతర లోహాల్ని బంగారంగా మార్చాడని అంటారు. రిప్లీ పత్రాల్ని సేకరించి పరిశోధించిన వారిలో మహా శాస్త్రవేత్త సర్ ఐసాక్ న్యూటన్ కూడా ఉన్నారు. రిప్లీ రచించిన చిత్ర పుస్తకం విచిత్రంగా ఉంటుంది. దీనిలోనే సీసంతో బంగారాన్ని తయారుచేసే 'ది ఫిలాసఫర్స్ స్టోన్'కు కావాల్సిన ప్రయోగ వస్తువుల సమాచారం ఉందని అంటారు. కానీ దీని కోడ్‌ను ఎవరూ ఛేదించలేకపోయారు. అయితే రిప్లీ అసలు పుస్తకం ఎక్కడుందో తెలీదు. దాని మాతృకలు మాత్రం 16వ శతాబ్దం నుంచి అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం 23 మాతృకలను సేకరించగలిగారు. వీటిలో అతిపెద్దది 6 మీటర్ల ఎత్తు ఉంటుంది.



రిప్లీ స్క్రాల్స్

ది రోహాన్స్ కోడెక్స్

ఎక్కడి నుంచి వచ్చిందో ఎలా వచ్చిందో ఎవరు రచించారో తెలీదు గానీ రోహాన్స్ నగరంలోని హంగేరియన్ అకాడెమీ ఆఫ్ సైన్సెస్‌కు 1838లో గుస్తావ్ బత్యానీ అనే పుర ప్రముఖుడు తన గ్రంథాలయంలో భాగంగా దానం చేశాడీ గ్రంథాన్ని. అప్పటి నుంచి దీని మర్మం కనిపెట్టేందుకు కోడెక్స్ నిపుణులు ఎంత ప్రయత్నించినా కుదరలేదు. దీనిలోని పదాలు 20-40 అక్షరాలు, గుర్తుల్ని కలిగి ఉంటాయి. ఇదే కోడ్‌ను బ్రేక్ చేయడానికి కష్టంగా మారింది. మొత్తం 200 ప్రత్యేక సింబల్స్‌తో ఉన్న దీని వర్ణమాల ఎంతో క్లిష్టంగా ఉంటుంది. మొత్తం 448 పేజీలున్న ఈ పుస్తకాన్ని చాలా మంది అనువదించారు కానీ ఏ ఒక్కరిదీ ఆమోదం పొందలేదు. అసలిది ఏ ప్రాంతానిదో కూడా తేల్చడం కష్టంగా మారింది. చూచాయగా హంగేరీ, రొమేనియా, మన భారత్‌లలో ఏదో ఒక ప్రాంతానికి చెందినదని భావిస్తున్నారు.

ఇవే కాదు పరిశోధకులను వేధిస్తున్న వాటిల్లో 'పోపోల్ వుహ్', 'బుక్ ఆఫ్ సోయ్గా', 'డెడ్ సీ స్క్రాల్స్', 'ప్రొడిగియోరమ్ అక్ ఆస్టెంటోరమ్ క్రానికన్', 'ది రెడ్ బుక్', 'ది కోడెక్స్ సెరాఫినియానస్', 'రొంగోరొంగో', 'నాగ్ హమ్మాదీ లైబ్రరీ' వంటి అనేక గ్రంథాలు, రచనలున్నాయి.

- జే

రంగుల లోకం

ఇంద్ర ధనుసులో పొదిగి ఉన్నవి
ఎన్ని వర్ణాలు
ఎన్ని రంగుల జలపాతాలు
ఒక వర్ణ శోభిత దృశ్యం లా
ఒక రంగుల గొడుగులా
చూపుల్ని తన వైపు
లాక్కు పోవడం లేదూ!
ఒక అందాల ఆభరణంలా
మిరుమిట్లు గొలపడం లేదూ!
ఎన్ని జాతులు ఎన్ని మతాలు
ఎన్ని కులాలు ఎన్ని వర్ణాలు
ఒకే రక్తంలో పూయడం లేదూ!
మరి కన్నీటిని చెక్కుతున్న
శిల్పులెవరూ?
ఆత్మ హత్యలకు కారకులెవరు?
నాలో ఉద్వేగాన్ని
నీలోకి ఉద్బోధిస్తూ
నీలో ప్రేమను
పరిచయం చేయమంటున్నాను.

పరాకాష్టకు చేర్చే
విపరీత ధోరణుల్ని
ముక్కలు ముక్కలు చేస్తున్నాను
వీలైతే కాసింత ఓదార్పు నివ్వు
జీవితాన్ని కబళించే
శోక గీతికలకి
ఆరంభకుడివి
ఆరాధ్యుడువి కానే కారాదు.

జీవితాధ్యాయంలో
కాసింత ప్రేమను రుచి చూడు
ఒక్కసారిగా విద్వేషాలన్నీ
చెరో దిక్కులో పరుగులెడతాయి.

- గవిడి శ్రీనివాస్

9966550601

గొంతెండుతోంది

దాహం దాహం కేకలు
గొంతెండుతున్న జనం
అడుగంటుతున్న జలం
మండుతున్న ఎండలు
ఎండుతున్న బతుకులు
కరువు కోరల కాలం
చిమ్మిన చిద్రమైన గాయం
బురదనీళ్ళే ..తాగి బతుకీడుస్తున్న
ప్రజలు
గుక్కెడు నీళ్ళ కోసం
నెర్రెలిచ్చిన నాలుక....నేల
ఇంకిపోయిన మడుగులా ముఖం
చిన్న నీటి తుంపర్ల ఆశలు
మిద్దెల మేడలో మెరుస్తున్న...
మబ్బులు మనుష్యులు..
మద్యం పొంగి పొర్లుతున్న..
రక్తపు రహదారులు
పర్యావరణాన్ని
ప్రేమించలేనపుడు
పక్షుల పాటలే పాడనప్పుడు
వృక్షాలనే...అడ్డంగ నరికితే..!
నరకయాతనల కేకలు
పెట్టాల్సిందే..
కుళాయిలో కాకుల్లా... రాళ్లు
కూర్చాల్సిందే..
గొంతెండుతోంది..గొంతెండుతోంది
అని.....
మేఘాలకై...ముఖం..చూడాల్సిందే.

- తంగిరాల సోని

9676609234

కథ

పిడికెడు మట్టి

- యర్నాగుల సుధాకరరావు
9985265313



ఖరీదైన కారు శరవేగంతో కొత్తగా వేయబడ్డ తారురోడ్డులో లోతట్టు గ్రామానికి దూసుకు పోతోంది.డ్రయివర్‌కు ఆరోడ్డు కొత్త కనుక కళ్లన్నీ రోడ్డు మీద నిలిపేసి మరీ డ్రయివ్ చేస్తున్నాడు. రోడ్డు వేగంగా పాకురుకుంటూ వెళ్లే పాములా వంపులతో ఉంది. అక్కడక్కడ కనిపిస్తున్న గ్రామీణులు రోడ్డుకు అడ్డంగానే నడుస్తున్నారు. కారు హారన్ విని రోడ్డు పక్కకు అతి కష్టం మీద పక్కకు తొలుగుతున్న వారిని చూసి డ్రయివర్ ఒకింత విస్తు పోతూనే చాలా మారాలి వీళ్లు అని మనస్సు లోనే తర్కించుకుంటూ సాగాడు.

వెనుక సీట్లో కూర్చున్న ఆఫీసర్ అసిరయ్య గ్రామం దగ్గర పడుతుంటే కళ్లు సాగదీసుకుని చూడసాగాడు. తన చిన్నతనం అంతా ఈ పరిసరాల్లోనే గడిచింది. తండ్రితో సంతకు వెళ్లడం. పొలం దున్నుతుంటే గట్టుమీద చెట్టు నీడలో కూర్చుని మట్టి వాసన ఆస్వాదిస్తూ గడిపిన రోజులు ఒక్కొక్కటి గుర్తుకు వచ్చాయి.

కారు ఆగింది."సార్ రెండు రోడ్ల కూడలి వచ్చింది. ఏవైపు వెళ్లేది?"అడిగాడు.

"అదిగో కనిపిస్తోంది చూడు. అదే మా గ్రామం. అక్కడకే మనం వెడుతున్నది."ఎంతో ఉత్సాహంగా చెప్పాడు అసిరయ్య.

"సార్ ఈ చిన్న గ్రామంలో మీరు పుట్టడం. బాగా చదువుకుని గొప్ప ఆఫీసర్ కావడం అంతా చాలా చిత్రంగా ఉంది సార్" మెప్పుకోలుగా ఆ రెండు మాటలు చెప్పగలిగాడు.

"నిజమే, ఈ గ్రామానికి ఎలాంటి ఫెసిలిటీలు లేవు. సమీపంలో కూడా చిన్నపాటి బడి లేదు. మూడు నాలుగు కి॥మీ॥ దూరం పోయి చదవాల్సిందే.అప్పట్లో నాకు చదువుకోవడానికి ఎలాంటి అవకాశం లేదు. నా తండ్రి పాలేరుగా పని చేసేవాడు. ఆయన వెంట తిరిగి చిన్నాచితకా పని చేసుకునే వాడిని."

డ్రయివర్ కారు స్లోగా నడిపిస్తూనే చెవులు రిక్కించి అసిరయ్య చెబుతున్న కథనం ఆసక్తిగా విన్నాడు.

" నాకు పేదరికం అంటే ఏమిటో? పూట పూటకు వేసే ఆకలి బాధ ఏమిటో బాగా తెలుసు. నాన్న వ్యవసాయ కూలీగా రెక్కలు ముక్కలు చేసుకుని ముగ్గురు పిల్లల్ని, నా తల్లిని పోషించడానికి నానా పాట్లు పడేవాడు. చివరికి నా ఇద్దరు అక్కలు అర్థాకలితో అలమటించి అనారోగ్యం కారణంగానే చనిపోయారు. ఆ బెంగతో మా అమ్మ మంచానపడింది. నాన్న మానసికంగా బాగా డీలా పడిపోయాడు." చెప్పడం ఆపి కారు లోంచి ఆత్రంగా బయటికి చూసాడు అసిరయ్య.

కారు గ్రామంలోకి ప్రవేశించింది.

అప్పుడున్న గుడిశెలకు బదులు చిన్న మిద్దెలు, రేకుల ఇళ్లు అలా ఇలా వెలిసాయి.అప్పుడే ఎవరిదీ కారు? వచ్చేది ఎవరు అన్నట్లుగా అన్ని ఇళ్లల్లోని అమ్మలక్కలు, బక్కచిక్కిన రైతులు, వృద్ధులు ఆసక్తిగా గుడ్లప్పగించి చూడసాగారు.

అసిరయ్య కారు మెల్లగా మట్టిరోడ్డులో పోతుంటే గ్రామంలో అన్నివైపులకు చురుగ్గా చూస్తూనే ఊరవతల ఉన్న దయ్యాల మర్రిచెట్టు కింద కారాపించి దిగాడు.

మర్రిచెట్టుకు ఆనుకుని మట్టిదిబ్బ మట్టి రోడ్డుకు ఒకింత ఎత్తుగా కన్పించింది.మెల్లగా వెళ్లి ఆ దిబ్బ ముందు నిలబడ్డాడు.

డ్రయివర్ కూడా దిబ్బ ముందు ఆగాడు.

"ఇదే మా మట్టి ఇల్లు.మా నాన్న రెక్కలు ముక్కలు చేసుకుని మట్టి పిసికి కట్టుకున్న సొంతిల్లు. నా బాల్యం మొత్తం ఇక్కడే గడిచింది. నా ఇద్దరు అక్కలు ఈ పూరిపాకలో చనిపోయారు. మానాన్న కూడా చనిపోయి శవంగా రెండు రోజులు ఈ ఇంటిలోనే ఉండి పోయాడు."చెప్పి కళ్లనీళ్లు తిప్పుకున్నాడు.

డ్రయివర్ ఇలాంటి కథ వింటాడనుకోలేదు. సార్ ముఖం చూడలేకపోయాడు. వినడానికి కూడా చాలా ఇబ్బంది పడ్డాడు.

అల్లంత దూరంలోంచి కొందరు గ్రామానికి చెందినవారు గుచ్చిగుచ్చి చూడసాగారు.

అసిరయ్య తిరిగి తన కథనాన్ని డ్రయివర్‌కు చెప్పాడు. ఆ చెప్పడంలో ఏదో సంతృప్తి కన్పించి మరింత ఉత్సాహంగా చెప్పడానికి పాత కథను

గుర్తుకు తెచ్చుకుని మరీ చెప్పాడు.

" ఈ చిన్న గ్రామానికి అన్ని గ్రామాల్లో ఉన్నట్లే ఒక మోతుబరి లేని అధికారం చెలాయిస్తూ అందరిని తన గుప్పిట్లో నొక్కి పట్టి ఉంచుతూ రాజులా ఏలాడు. అతని వద్దనే మానాన్న పనిచేసేటోడు. చాలీచాలని కూలికి పనిచేసి అతడు ఆకలితో ఉంటూ మాకు ఆకలి అంటే ఏమిటో తెలియ చేసేలా పేదరికంలో మిగిలాడు. నాకు 8 ఏళ్లు నిండినా పలకా బలపం ఏమిటో తెలియలేదు. పట్టణానికి పోయి ఏ టీకొట్టులోనో పనిచేస్తే ఎంతో కొంత వస్తుందనే ఆశతో నేను సిద్ధ పడ్డాను. కొన్నాళ్లు పనిచేసాను. నాకు వచ్చే రోజు కూలి జీతంతో బియ్యం లేదా నూకలు కొనేవాడిని. టీ కొట్టులో నా కొలువు ఎక్కువ కాలం సాగలేదు.ఇద్దరు అక్కలు, నాన్న చచ్చి పోదామనుకుని కూడబలుక్కున్నట్లు ఒకే ఏడాది కొన్ని నెలలు తేడాతో చనిపోయారు.

గ్రామం వదిలి అమ్మానేను పట్టణం పట్టి పోయాం. అదే నా జీవితానికి పెద్ద మలుపు. అక్కడే నా దశ తిరిగింది. అదెలా అంటే టీ కొట్టులో పని చేసేటప్పుడు ఒక టీచర్‌తో పరిచయం అయ్యింది. నా గురించి టీ తాగుతూ అడిగే వాడు. నేను చేతులు కట్టుకుని మరీ చెప్పే వాడిని. నన్ను ఆసక్తిగా గమనించేవాడు. నేను పట్టణం వెళ్లిన వెంటనే ఆ టీచర్ ఇంటికి వెతు క్కుంటూ వెళ్లాను. ఆయన ఇంట్లోనే ఉన్నందున నన్ను చూసి ఎదురొచ్చి "ఏరా అసిరయ్యా ఏమిటి ఇలా వచ్చావు. టీ కొట్టులో పనిచేయట్లేదా?అక్కడ కన్పించడంలేదు." అని అడిగి విషయం తెలుసుకున్నాడు.

మా కథ విన్నాక టీచరయ్య ఇంట్లోకి తీసుకుపోయి 'ఇక్కడే ఉండండి. నా భార్యకు తెలియని అనారోగ్యం ఇంటి పనులు నీవు చూసుకో! అని మా అమ్మకు పని కల్పించాడు. నీ కొడుకు తెలివైనవాడు. చదివిస్తే చదువుకుని నీవు నమ్మలేని విధంగా తయారవుతాడు అని చెప్పి నన్ను ఒక సర్కారు బడిలో చేర్పించాడు.

అమ్మ నాకు బుద్ధిగా చదువుకోమని పదేపదే చెప్పి బడికి పంపేది. అక్కణ్నించి నా చదువు వెనక్కి తిరిగి చూడకుండా సాగిపోయింది.నాకున్న రిజర్వేషన్,నాచదువులో చురుకుతనం నాకు పిజి వరకు తీసుకు పోయింది. సర్కారు ఉద్యోగం రావడం ఆ సంతోషం టీచర్‌తో పంచుకోవడానికి ఢిల్లీ నుంచి వచ్చిన రోజే నా దురదృష్టం కొద్దీ టీచర్ అకాల మృతి చెందారు. కన్నీరు మున్నీరు అయ్యాను. వాస్తవానికి చాలాకాలం వరకు తట్టుకోలేకపోయాను.

నా ఉన్నతికి మార్గదర్శకుడు, నాకు కన్పించిన దేవుడే ఆ టీచర్. ఆయన లేకపోవడం ఇప్పటికి నేను భరించరాని వెలితి నా జీవితం లో మిగిలిపోయింది. అలాంటి టీచర్ మనుష్యుల్లో దేవుళ్లాంటి వారు.ఆయన భార్య నేటికి దీర్ఘ కాలం రోగిష్టిగానే నాతల్లి సేవలు అందు కుంటూ వాళ్ల సొంతింట్లో ఉంటోంది."

తన మనస్సు అంతా డ్రయివర్‌కు విప్పి చెప్పుకోవడంతో ఒకింత తేలిక పడ్డట్లుగా అయి పోయాడు అసిరయ్య.

అప్పటికే నలుగురైదుగురు గ్రామీణులు వచ్చిచేరారు.

"ఎవరయ్యా మీరు? ఈ దయ్యాల మర్రి చెట్టు వద్ద ఏమి చూస్తున్నారు?" చుట్టూ చేరిన వారిలో ఒకడు చొరవగా అడిగాడు.

"దయ్యాల మర్రిచెట్టా?"ఎదురు ప్రశ్నించాడు కారు డ్రయివర్.

"అవునయ్యా! ఈ చెట్టునిండా దయ్యాలే. బలిమిన చచ్చినోళ్లంతా అదిగో ఆ వల్లకాటిలో తగలడ్డాక దయ్యాలై ఈ చెట్టుమీద మమ్మల్ని పీక్కుతినడానికి కాపు కాసుకుని ఉంటాయి. ఈ వైపు ఎవరం రాలేం. వస్తే ఒప్పుకోవు. దయ్యాల భయం" విడమర్చి చెప్పాడు.

"ఆ బాబు ఆఫీసర్‌లా ఉన్నాడు.ఆ దిబ్బ మీద కూకున్నాడు. ముందు దిగిపోమను. దయ్యాలు పట్టీగలవు."మరొకడు మర్రిచెట్టు తొర్రల వైపు చూస్తూ డ్రయివర్‌తో చెప్పాడు.

అసిరయ్య వారి మాటలను తలపంకిస్తూ బాధతో వినసాగాడు.

"ఈ దిబ్బ ఒకప్పుడు పెద్దింటోళ్ల పాలేరు పూరిల్లు .ఆడు చచ్చాక రెండు రోజులు పాకలో ఉండి పోయాడు. అప్పుడే ఆడు అసలు సిసలు దయ్యం అయిపోయి ఈ చెట్టుమీద దయ్యాల రాజు అయిపోయాడు. సీకటి పడితే ఆడికి ఎక్కడలేని శక్తి వచ్చేసి దారినపోయినోళ్ల మీద పడిపోతుం టాడు."చెప్పి అసిరయ్యను మట్టి దిబ్బ వదిలి రమ్మని సైగలు చేసాడు గుంపులో ఒకడు.

వారి మూఢనమ్మకపు మాటలకు అసిరయ్య హతాశుడయ్యాడు.'నాన్న దయ్య మయ్యాడా?ఎంత అజ్ఞానంతో నమ్ముతూ చెబు తున్నాడు?'అని మనస్సులో అనుకుని మౌనంగా మట్టి దిబ్బను వదిలి కొద్ది దూరం జరిగాడు.తాను వచ్చిన పనిని గుర్తుకు తెచ్చుకుని వంగి దిబ్బ లోంచి మూడు పిడికిళ్లు మట్టి తీసి ఒక గుడ్డ సంచిలో వేసుకుని కారువైపు కదిలాడు.అక్కడ చేరిన గ్రామీణులు బిక్కముఖాలు వేశారు.

"మట్టి ఎందుకయ్యా పట్టుకెడుతున్నావు?. నువ్వు చూస్తే పెద్ద ఆఫీసర్‌లా ఉన్నావు. ఈ దయ్యం దిబ్బ మట్టితో నీకేం పని?"నిలదీసి అడిగినంతగా అసిరయ్య సమీపంలోకి పోయి అడిగాడు ఒక గ్రామీణుడు.

"ఈ మట్టి దిబ్బలో ఒకప్పుడు పాలేరు అతడి కుటుంబం ఉండేది." అని ఇంకా అసిరయ్య చెబుతుండగా మధ్యలోనే అందుకుని "అదే కదయ్యా! నేను చెబుతున్నది.పాలేరు ఈ పాకలో ఉన్నప్పుడే అతడి కళ్లముందు ఇద్దరు కూతుళ్లను దయ్యాలే పిసికేసాయి.ఆ తర్వాత పాలేరును పిసికేసాయి. ఆ భయానికి పాలేరు భార్య ఉన్న ఒక్క కొడుకుని ఎత్తుకుని ఊరు వదిలేసింది. లేకుంటే ఆ ఇద్దరిని దయ్యం పిసికేసేది." చెప్పాడా గ్రామీణుడు. అతడికి వంత పాడారు మిగిలిన వారు.

"సరే, నేను చెప్పేది వినండి. ఆనాడు గ్రామం వదిలి నేను నా తల్లి పారిపోయాం. అలా వెళ్లిపోయి చదువుకుని సర్కారు కొలువులో చేరి ఇలా వచ్చాను." అని చెప్పేసరికి విన్న గుంపంతా నోళ్లు వెళ్లబెట్టారు.

"అవును అదే ముఖమే. ఎంత ఎదిగావు. ఎలా మారిపోయావు?పెద్ద ఆఫీసర్ అయిపోనావు"

గుంపులో ఒక పెద్దాయన ముందుకు వచ్చి చేత్తో అసిరయ్యను తడిమాడు. "నేను మీ అయ్య మంచి దోస్తులం.ఆ రోజు ఊళ్లో మనూరి పెద్దోళ్ల ఇంట్లో పెళ్లి హడావుడి. మీ అయ్య గుడిశెలో చచ్చిపోతే ఎవరం రాకుండా అయి పోయాం. పొన్నూరు భూత వైద్యుడు దయ్యం ఆ ఇంట్లో వారిపై పగబట్టింది.తల్లీ కొడుకును కూడా చప్పరించేస్తాది. అక్కడితో దయ్యం ఆగదు ఆళ్లను ఖతమ్ చేసాక ఇక రుచి మరిగినందున మీ ఊరి మీద పడిపోయి చాలామందిని చప్పరించేస్తాది అని చెప్పాడు. దాంతో పాకలో మీ అయ్య శవాన్ని పాకతో కాల్చేద్దామని అంతా నిర్ణయానికి వచ్చేసి మీ వస్తువులు బయటికి విసిరేసి గుడిశకు నిప్పెట్టారు.చేతిలో చిల్లిగవ్వ లేని నీతల్లి నీవు రోడ్డున పడ్డారు. నేనే ఆ రోజుల్లో కొన్ని బియ్యం గింజలు.. పాతిక రూపాయిలు చేతికి ఇచ్చి మీ ఇద్దరిని ఊరు దాటించేసాను" చెప్పాడు ఆ పెద్దాయన.

అతనికి చేతులు జోడించాడు అసిరయ్య.

"సరే నాయన, పెద్ద ఆఫీసర్ అయినందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. ఈ మట్టి ఎందుకు తీసుకు వెడుతున్నావు?"

"పెద్దాయనా ఆనాడు నా తండ్రి,నా అక్కలు ఈ పూరిపాకలో దిక్కుమాలిన చావుకు గుర య్యారు. తిండానికి తిండి, మందులు కొనలేని పరిస్థితిలో ఉండేవాళ్లం. పేదరికమే వాళ్లను చంపేసింది. అంతేగాని ఏ దెయ్యమో కాదు.అప్పట్లో నేనేం చేయలేకపోయాను. ఊళ్లో వారంతా పిచ్చిపట్టినట్టు మా ఇంటిని కాల్చేస్తుంటే...ఉన్న ఒక్క ఆధారాన్ని కూల్చేస్తుంటే చాలా బాధ పడ్డాను. ఇప్పుడు కనీసం ఈ మట్టినైనా జాగ్రత్త చేసుకుని జ్ఞాపకాలు నిలుపు కుందామని" అని కళ్లలో నీళ్లు తిప్పుకుని చెప్పాడు.

అంతా ఓదార్పుగా అసిరయ్యను చూశారు. తమ తప్పుకు సిగ్గుపడ్డారు.

✦



మనిషి పుస్తకం

అట్ట చూసి పుస్తకం మీద ఓ అభిప్రాయానికి రావొద్దనే మంచి మాట ఉంది. మనుషులు కూడా అంతే. రూపం, ఆహార్యం, తీరుతెన్నులు, వృత్తులు, వ్యాపకాలు, నేపథ్యాలు చూసి మనిషిపై ముందే ఓ మాటకొచ్చేయొద్దంటారు 'హ్యూమన్ లైబ్రరీ' నిర్వాహకులు. మనిషిని పూర్తిగా చదవమంటారీ మానవ గ్రంథాలయంలో. మనుషులే ఇక్కడ పుస్తకాలు. ఓ వ్యభిచారి, ఓ మానవతావాది, ఓ డేర్‌డెవిల్, ఓ విప్లవకారుడు, ఓ దొంగ, ఓ మత పెద్ద ఇలా ఒక్కో నేపథ్యం, ఒక్కో జాతి, ఒక్కో ప్రాంతం నుంచి వచ్చేవారికి ఓ ట్యాగ్‌లైన్ ఇచ్చేసి వారి జీవితాల్ని చూడొద్దంటూ అసలు మనసును తెలుసుకోండని చెబుతున్నారు. ఈ ఏడాదిలో మన దేశంలోను (డెహ్రాడూన్) ఈ లైబ్రరీ తెరవనున్నారు.

ఒళ్లంతా పచ్చబొట్లు పొడిపించుకుని, చెవులకు, ముక్కుకు రింగులు పెట్టుకుని నాలుకను రెండుగా చీల్చుకుని గుండు మీద ఉన్న నాలుగు వెంట్రుకలకూ నాలుగు రంగులు అద్దుకుని, చిరిగిన ప్యాంటు, చేతుల్లేని టీషర్ట్, ఇనుప చైన్ మెళ్లో వేసుకుని ఎవరైనా కనిపిస్తే తటాలున మనకోటి తట్టేస్తుంది. అలానే పరాయి మతస్తుడి పేరు చెప్పినా, తెలీని వృత్తివారని అన్నా ఏదో ఒక అభిప్రాయంతో ఉంటాం. ఇలా మనిషి పైపై విషయాల్ని చూసి ఓ అంచనా కట్టేయకుండా వారితో కూర్చుని కాసేపు మాట్లాడితే వాళ్లేంటనేది తెలుస్తుందని.. మనం తప్పుడు స్టాంప్ వేసేసిన వాళ్లు కూడా గొప్ప మనసున్న వాళ్లనే సంగతి అర్థమవుతుందని 'హ్యూమన్ లైబ్రరీ' నిర్వాహకులు అంటారు. 2000 కోపెన్‌హ్యాగన్‌లో నిర్వహించిన ఉత్తర యూరప్‌లోనే అతి భారీ రోస్కిల్డే ఉత్సవంలో భాగంగా రోన్ని, డేనీ అబెర్జెల్ సోదరులు వారి సహచరులు అస్మా మౌనా, క్రిస్టోఫర్ ఎరిక్‌సెన్‌లు కలసి ఈ ప్రాజెక్ట్‌ను రూపొందించారు. దీనికో నేపథ్యముంది. వీరు అంతకు ముందు 'స్టాప్ ది వయొలెన్స్' (హింసను ఆపండి) అనే ఉద్యమాన్ని చేపట్టారు. 1993లో భిన్నంగా ఉండే వీరి మిత్రుడొకరిని నైట్‌లైఫ్‌లో కొందరు వ్యక్తులు కత్తి పోట్లు పొడిచారు. కేవలం అతడి ఆహార్యం చూసి నేరగాడిలా భావించి హత్యాయత్నం చేశారు. ఇలా లేనిపోని అపోహలు, అభిప్రాయాలతో చాలామంది కష్టాల్లో పడుతున్నారని గ్రహించి హింసకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని లేవనెత్తారు. అది పెద్ద సంచలనమై ఏకంగా 30 వేల మంది డేనిష్ యువత చేతులు కలిపింది. దీని గురించి తెలుసుకున్న ఉత్సవ దర్శకుడు లీఫ్ స్కోవ్ ఈ నలుగురిని పిలిచి... మానవ సంబంధాల మెరుగుదలకు ఏదైనా ప్రత్యేకమైన ప్రాజెక్ట్ చేపట్టమన్నారు. అలా పుట్టిందే 'హ్యూమన్ లైబ్రరీ'.ఒక్కో కార్యక్రమంలో 50-100 విభిన్న నేపథ్యాలకు చెందిన వ్యక్తుల్ని కలుసుకునే అవకాశాన్నిస్తారు. నాలుగు రోజుల పాటు రోజుకు ఎనిమిది గంటల చొప్పున ఈ గ్రంథాలయాన్ని నడుపుతారు. దీనికి వేల సంఖ్యలో పాఠకులు హాజరవుతారు. మనుషుల్ని చదవడమంటే వారితో ఏదీ దాచకుండా సంభాషించడమే. మాటలంటే ఓ పది నిమిషాలు కాదు గంటల తరబడి అవసరమైతే రోజుల పాటు చదవొచ్చు. ఎంతటి సూటి ప్రశ్న, ఇబ్బందికర ప్రశ్నలైనా అడిగి సమాధానం రాబట్టొచ్చు. ఎంత వద్దన్నా ఎందుకు గ్రాఫిటీ వేస్తున్నారో యువతను అడిగి ఓ పోలీస్ అధికారి తెలుసుకుంటాడు. యువ ఉద్యమకారుడి పోరాటానికి కారణాల్ని ఓ రాజకీయ నేత అర్థం చేసుకుంటాడు. ఇక్కడ పరస్పరం ఒకరి గురించి ఒకరికి స్పష్టంగా విషయాలు తెలుస్తాయి. ఇక్కడ ఓ అత్యాచార బాధితురాలి జీవితాన్ని చదవొచ్చు. ఓ మత్తు బానిస హృదయాన్ని తెలుసుకోవచ్చు. ఓ జులాయి మనస్తత్వాన్ని అర్థం చేసుకోవచ్చు. ఓ ఒంటరి స్త్రీ ఔన్నత్యాన్ని చూడొచ్చు. ఓ నేరగాడి నైజాన్ని కనొచ్చు. మనం ఏవేవో ఊహించుకునే వ్యక్తుల అసలు సంగతుల్ని 'హ్యూమన్ లైబ్రరీ' పదిహేనేళ్లుగా ప్రపంచమంతటా స్పష్టపరుస్తోంది. వారంతా మీ అందరిలాంటి వాళ్లే అంటూ నలుగురిలో

కలిపే ప్రయత్నం చేస్తోంది. అలానే ఓ శాస్త్రజ్ఞుడు, ఓ వైద్యుడు, ఓ కూలీ ఇలా ఒక్కొక్కరి జీవితం ఎలాంటిదో పరిచయం చేస్తోంది. ప్రస్తుతం ఈ మానవ గ్రంథాలయాలు 70 దేశాల్లో పని చేస్తున్నాయి. వీటిలో మీరు ఓ పుస్తకంగా మారే అవకాశం కూడా ఇస్తున్నారు. అలానే ఈ మానవ గ్రంథాలయం శాఖను నడిపే విషయంలోను సహాయం చేస్తారు. ఈ ప్రత్యేక వేదికలో భాగం కావాలంటే వారి అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించి దానిలో దరఖాస్తు నింపాల్సి ఉంటుంది.

✦



ముక్కల పచ్చడి

కావాల్సిన పదార్థాలు

మామిడి కాయలు (పుల్లనివి) - మూడు
కారం - 1 కప్పు, మెంతి పొడి -1/4 కప్పు
ఉప్పు- 1/4 కప్పు, మెంతులు- 1 టేబుల్ స్పూను
ఆవాల నూనె 1/4 కప్పు

తయారుచేసే విధానం

ముందుగా మామిడి కాయల్ని శుభ్రంగా కడిగి తడి లేకుండా తుడవాలి. అరగంట పాటు వాటిని ఆరనిచ్చి తర్వాత తొక్కతీయకుండా చిన్న చిన్న ముక్కల్ని తరగాలి. ఇప్పుడు ఆవాలు, మెంతులను బంగారు రంగు వచ్చేవరకు వేయించి చల్లారిన తర్వాత పొడి చేసుకోవాలి. నువ్వుల నూనెను వేడి చేసి చల్లారనివ్వాలి. ఇప్పుడు ఒక బౌల్‌లోకి కారం, ఉప్పు, ఆవాలు, మెంతుల పొడి వేసి కలపాలి. ఇప్పుడు మామిడికాయ ముక్కల్ని కూడా వేసి ఈ మిశ్రమం ముక్కలకి పట్టేలా బాగా కలపాలి. తర్వాత ఒక సీసా లేదా జాడి తీసుకుని పచ్చడిని అందులో ఉంచి మూతపెట్టాలి. ఒక రోజంతా మగ్గనిచ్చి తర్వాత పోపు వేసి అందులో పచ్చడినంతా కలపాలి. గాలి చొరబడకుండా భద్రపరిస్తే ఈ పచ్చడి నెల రోజులు పాడవకుండా ఉంటుంది.

నువ్వుల ఆవకాయ

కావాల్సిన పదార్థాలు

మామిడికాయ ముక్కలు - 2 1/2 కప్పులు
నువ్వులు - 1/2 కప్పు
కారం - 1/3 కప్పు, ఉప్పు-1/2
నువ్వుల నూనె - 1/2 కప్పు

తయారుచేసే విధానం

ముందుగా మామిడి కాయల్ని శుభ్రంగా కడిగి ఆరబెట్టాలి. తర్వాత మామిడి కాయల్ని సగానికి తరిగి మధ్యలో ఉండే టెంకను వేరు చేసి ముక్కలు కట్‌చేయాలి. ముక్కలకు తడిలేకుండా ఉండేలా కొంత సేపు ఆరనివ్వాలి. నువ్వుల్ని గోధుమ రంగు వచ్చేలా వేయించి చల్లారాక మిక్సీ జార్‌లో వేసి పొడిచేసుకోవాలి. మరీ ఎక్కువ సేపు బ్లెండ్ చేస్తే నువ్వులు రుచిగా ఉండవు. ఇప్పుడు కొంచెం పెద్ద బౌల్ తీసుకుని నువ్వుల పొడి, కారం, ఉప్పు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమంలో మామిడి ముక్కలు వేసి వాటికి ఉప్పు, కారం, నువ్వుల పొడి బాగా పట్టేలా కలపుకోవాలి. ఇందులో నూనె వేసి మరో సారి కలపాలి. ఇప్పుడొక గాజు సీసా లేదా జాడీ తీసుకుని బాగా కలపిన మామిడి ముక్కల మిశ్రమాన్ని అందులో ఉంచాలి. తర్వాత ఆ మిశ్రమంపై నువ్వుల నూనె వేసి గాలి చొరబడ కుండా మూత పెట్టాలి. ఈ పచ్చడిని రెండు మూడు రోజులు నాననివ్వాలి. నూనె పైకి తేలే కొద్దీ పచ్చడి తయారవుతుంది. వీలున్నప్పుడు పచ్చడి కలుపుతూ రెండు, మూడు రోజులు మగ్గనివ్వాలి.

పంజాబీ అచార్

కావాల్సిన పదార్థాలు

మామిడి కాయ ముక్కలు - 4 కప్పులు
ఆవాల పొడి - 1 కప్పు
పచ్చి ఆవాల పొడి - 1/2 కప్పు
ఉప్పు - 1 కప్పు
సోంపు - 100 గ్రాములు
మెంతులు- 3 టేబుల్ స్పూన్లు
నల్లజీలకర్ర - 1 టేబుల్ స్పూన్
పసుపు - 1 టేబుల్ స్పూన్,
ఆవనూనె - 350 మి.లీటర్లు

తయారు చేసే విధానం

ముందుగా మామిడి కాయల్ని శుభ్రంగా కడిగి ఆరనివ్వాలి. తర్వాత చిన్న ముక్కలుగా తరిగి కొంత సేపు ఆరబెట్టాలి. ఇప్పుడు మిక్సీ జార్‌లో సోంపు, మెంతులు వేసి పొడి చేయాలి. తర్వాత ఒక పెద్ద బౌల్‌లో మామిడి ముక్కల్ని తీసుకుని అందులో ఆవాలు సోంపు, మెంతి పొడి, ఉప్పు, పసుపు రంగు ఆవాలు, నల్ల జీలకర్ర, పసుపు వేసి బాగా కలపాలి. మరో బౌల్ తీసుకుని అందులో ఆవాలు, సోంపు, మెంతి పొడులు తీసుకుని కొంచెం నూనె వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని మామిడి ముక్కల మిశ్రమానికి జతచేర్చి మరోసారి బాగా కలుపుకోవాలి. ఈ మొత్తం మిశ్రమాన్ని ఒక గాజు సీసా లేదా జాడీలోకి తీసుకుని పావు కప్పు నూనె వేసి మూత పెట్టాలి. ఒకరోజు తర్వాత ఈ మిశ్రమంలో మరికొంచెం నూనె వేసి కలిపి మూతపెట్టాలి. రెండు మూడు రోజులు మగ్గనివ్వాలి. కారం వాడకుండా తయారు చేసే ఈ పచ్చడి చెపాతి, పరోటాల్లోకి చాలా రుచిగా ఉంటుంది.

బాల నేస్తాలు

ఏమిటది?

కాళ్లులేవుగాని నడుస్తుంది.
కళ్లు లేవుగాని ఏడుస్తుంది.

జ: మేఘాలు

చుక్కలు కలపండి

లిటిల్ స్టార్

హాయ్ ఫ్రెండ్స్ నేనొక స్టార్‌ని! ఇది నా చిన్ననాటి ఫోటో ఇంతకీ నేనెవరో చెప్పండి?

జ: హన్సిక

తేడాలు గుర్తించండి

ఈ రెండు బొమ్మల్లో ఐదు తేడాలు ఉన్నాయి. వాటిని మీరు గుర్తించి సున్నాచుట్టేయండి.



కనిపెట్టండి

అగ్గిపుల్లలతో చేసిన ఈ మూడు త్రిభుజాల్లో కొన్ని అగ్గిపుల్లల క్రమాన్ని మారిస్తే నాలుగు త్రిభుజాలు ఏర్పడతాయి. అదెలాగో కనిపెట్టండి.

బొమ్మ పూరించండి

పిల్లలూ! మీకు బొమ్మలు గీయడమంటే ఎంతో ఇష్టం కదూ! మీ కోసం ఆర్టిస్ట్ అంకుల్ ముందుగా బొమ్మల్ని సగం గీసి ఉంచాడు. మీరు మిగిలిన భాగాన్ని జాగ్రత్తగా పూర్తిచేయండే!



ఆకులతో బొమ్మ

పిల్లలు మీకు ఎలుక అంటే చాలా ఇష్టం కదూ. మీ ఇంటి ముందు పడిన ఎండు ఆకులతో ఎలుక బొమ్మను ఎలా తయారు చేయాలో ఇక్కడిచ్చాం. మీరు ప్రయత్నిస్తారు కదూ.



నీడ గుర్తించండి

ఇక్కడ ఒక చేపబొమ్మనిచ్చాం. కింద ఉన్న నీడల్లో దాని అసలైన నీడ ఎక్కడుందో గుర్తించండి.



చిట్టి ఏరోప్లేన్

పిల్లలూ ఆకాశంలో పెద్ద శబ్దంచేసుకుంటూ వెళ్లిపోయే ఏరోప్లేన్‌కు టాటా చెబుతూ అది కనిపించనంత దూరం వెళ్లేవరకు దానివంక అలా చూస్తూండిపోతారు. అలాంటి విమానం బొమ్మని మన ఇంట్లో దొరికే కొన్ని వస్తువులతో మనమూ తయారు చేసుకోవచ్చు ఎలా చేయాలో మేం నేర్పిస్తాం. బుద్ధిగా నేర్చుకోండే!

కావాల్సిన వస్తువులు

బట్టల క్లిప్- 1
రంగు కాగితాలు- 2
ఐస్ క్రీమ్ పుల్లలు పెద్దవి-2, చిన్నది-1, గమ్ -1

తయారుచేసే పద్ధతి

ముందుగా ఐస్‌క్రీమ్ పుల్లలను రంగు కాగితాలపై ఉంచి వాటిచుట్టూ పెన్సిల్‌తో మార్క్ చేసుకుని జాగ్రత్తగా కత్తిరించాలి. తర్వాత కత్తిరించిన ముక్కలను ఐస్‌క్రీమ్ పుల్లలకు చుట్టి గమ్‌తో అతికించాలి. రంగు కాగితాలను మనకు నచ్చిన కలర్, డిజైన్లలో తీసుకోవచ్చు. ఇప్పుడు బట్టలక్లిప్ తీసుకుని దాని ముందు భాగంలో క్లిప్‌కి కొంచెం పైభాగంలో ఉండేలా ఐస్ క్రీమ్ పుల్లను రెండు పక్కలా గమ్‌తో జాగ్రత్తగా అతికించాలి.



ఇప్పుడు మన ప్లేన్‌కి రెక్కలు వచ్చేశాయి. తర్వాత క్లిప్ వెనుక భాగంలో చిన్న ఐస్‌క్రీమ్ పుల్లను తీసుకుని గమ్‌తో అతికిస్తే చిట్టి ప్లేన్ రెడీ! ఈ ప్లేన్ మీ చిట్టిచెల్లెళ్లు, తమ్ముళ్లకు ఆడుకునేందుకు ప్రజంట్‌చేసి వాళ్లని సర్‌ప్రైజ్ చేయండి.

పదవికాసం - 15

కూర్పు: టి.డి. ప్రసాద్

1	2		✿	3		✿	4		✿
5		✿	6		✿	7		✿	8
	✿	9		✿	10		✿	11	
12	13		✿	14		✿	15		✿
✿		✿	16		✿	17		✿	18
19	✿	20		✿	21		✿	22	
✿	23		✿	24		✿	25		✿
26		✿	27		✿	28		✿	29
	✿	30			✿		✿	31	
✿	32			✿	33	✿	34		

ఆధారాలు

అడ్డం

1. కూడబెట్టడం (3)
3. తొలి బేరం (2)
4. పాత్ర అటు నుంచే మొదలైంది (2)
5. సైకిల్ టైరు కింద ఊచలతో ఉండేది (2)
6. ఆవైపు (2)
7. శరీరం (2)
9. రేపటికి మొన్న (2)
10. చిన్న కత్తి (2)
11. మునుపు, క్రితం, ముందు (2)
12. పూర్ణం వదిలిన దరిద్రం (3)
14. పొడుం, చూర్ణం (2)
15. దీనికి ఏడు రోజులు (2)
16. త్వరపడు (2)
17. రంధ్రం, గుహ (2)
19. తెలుగు అక్షరమాలలో తొలిది (1)
20. ఎద్దుల మెడలపై దీన్ని ఉంచి బండి, బండ లాగిస్తారు (2)
21. సుశాంత్, శాన్వి, కార్తీక్‌రెడ్డి కాంబినేషన్లో 2013లో వచ్చిన సినిమా (2)
22. కక్షిదారులు చివర్లో లేరు (2)
23. ధనం (2)
24. భూమి, లోకం (2)
25. ఆధారం (2)
26. క లేని ఎముక (2)
27. చివర తెగిన కత్తులు (2)
28. వయసు, ప్రాయం (2)
30. దండాలు వరుస మారాయి (3)
31. డబ్బు దాచుకునే చిన్న సంచి (2)
32. కాపురం, సంసారం (3)
33. అడ్డం 19తో కలుపుకుని మాతృమూర్తి (1)
34. బయట పల్లకి మోత ఇంట్లో ఈమోత (3)

నిలువు

1. గజిబిజి పొదరిల్లు (4)
2. దువ్వ, ధూళి (2)
3. ఆంగ్లంలో పడవ (2)
4. మూడింటి సమూహం (2)
6. అగ్రజుడు, జ్యేష్ఠుడు (2)
7. తోక తెగిన కాకులు (2)
8. పడకకు పేకల కలబోత (2)
9. శయనం, నిదుర (2)
10. కొండెం (2)
11. వేడి (2)
13. శూన్యం (2)
14. రుబ్బుడు గుండు (3)
15. తోక (2)
16. ఖరీదైన విదేశీ కారు (2)
17. బిడ్డను పిలవండి (2)
18. పిట్ట (2)
20. కృతి, పదబంధం (2)
21. రేసు కోర్సుల్లో పరుగెత్తేది (2)
22. రాశాక జేబులో పెట్టుకునేది (2)
23. ముద్ర పైకి (2)
24. ఇవి పొలంలో చల్లితేనే మొలకలు వచ్చేది (3)
25. ముప్పయిలో పదో వంతు (2)
26. వానపాము, ఎరుపు (2)
27. మిశ్రమం, మిళితం (3)
28. అసూయ (2)
29. ఆసుపత్రుల్లో సిస్టర్ అని పిలిపించుకునే వారు (3)
30. ఒక దానిలో మూడో ఆటుంది 3,9 (2)
31. శత్రుత్వం (2)

సుడోకు

	9			8				5
	1			5	6	8		
5						1	9	
1				7	9	2	8	
	2	8	6		5	7	3	
	3	7	8	2				1
	4	3						7
		9	2	3			4	
8				9			2	

గతవారం జవాబులు

8	4	9	1	2	3	5	6	7
1	2	3	7	6	5	8	4	9
5	6	7	4	8	9	1	2	3
3	1	4	9	5	2	6	7	8
2	8	6	3	4	7	9	1	5
7	9	5	6	1	8	2	3	4
9	3	8	2	7	1	4	5	6
6	5	1	8	3	4	7	9	2
4	7	2	5	9	6	3	8	1

1 ఉ	2 ద్య	మం	✿	3 ధూ	మం	✿	4 ప	త్రి	5 క
6 ర	వి	✿	7 పా	ళి	✿	8 మం	త్ర	✿	లు
వ	✿	9 ఆ	ట	✿	10 బా	కీ	✿	11 న	వ
✿	12 నా	రు	✿	13 జా	వ	✿	14 పి	ల్లి	✿
15 సీ	సా	✿	16 రా	గా	✿	17 తా	త	✿	18 రె
మ	✿	19 తా	గి	✿	20 దా	నం	✿	21 డ్	✿
✿	22 నా	నా	✿	23 వా	రం	✿	24 క్రా	✿	25 డు
26 మా	య	✿	27 పా	ర	✿	28 స్	✿	29 క	ము
30 లి	నా	31 క	✿	32 సు	న్న	✿	33 గు	రు	వు
✿	34 రా	క్ష	సు	డు	✿	35 శ్రీ	✿	36 వు	లు



వన్య ముఖం

వన్యప్రాణుల నిర్బంధానికి వ్యతిరేకంగా తన ఛాయా చిత్ర కళతో నిరసనను ప్రదర్శిస్తున్నాడు లాస్ ఏంజెలెస్‌కు చెందిన డెవిన్ మిచ్చెల్. సహజ ఆవాసాలంత ఉండని జంతు ప్రదర్శన శాలల్లో వాటికి ఎంత అసౌకర్యంగా ఉంటుందో చెప్పేందుకు మనిషి ముఖానికి అరణ్య జీవుల రంగు పులిమాడు. తమ ప్రపంచం సగం మూసుకుపోయిందనే భావన కలిగేలా అరచేతులతో అర ముఖాన్ని దాచేశాడు. జూలలో వాటి స్వేచ్ఛపైకి కనిపించే మేకప్ అనేలా చూపుల్ని నిలిపాడు. 'వైల్డ్ ఫేసెస్' పేరిట ఇలా వంద జీవాల చిత్రాల్ని వంద ముఖాలకు వేసి ఓ ఛాయాచిత్ర పుస్తకాన్ని చిత్రించాడు.









సన్‌బర్స్ట్ స్టార్ టర్బన్

గ్లోరీ ఆఫ్ ఇండియా

బుల్ శంఖం

గవ్వల హారం

స్కాఫెల్లా



వెంటెల్ ట్రాప్

క్వీన్ శంఖం

ఇసుకల్లో అమూల్యాలున్నాయి. అచ్చెరువులున్నాయి. గురుతులున్నాయి. బహుమతు లున్నాయి. సంద్రం ఒడ్డుకు చేరిన ఆ సాగర రత్నాలే గవ్వలు, శంఖులు, ఆల్చిప్పలు. ప్రతి ఒక్కరికీ ప్రత్యేకమైనవి, అంకితమిచ్చేవి ఒకటి కాదు వేలల్లో దొరుకుతాయి. ఆ వెదుకులాటే ఎంతో ఆహ్లాదాన్నిచ్చి మనసును సేద తీరుస్తుంది. సుమారు లక్ష ఏళ్ల క్రితం నుంచే మనిషికి గవ్వల్ని సేకరించడమనేది ఓ మేనియా. ఈ కాంచైలోమేనియా పేరిట 17వ శతాబ్దానికి పేరు కూడా ఉంది. రాణుల నుంచి ప్రేమికుల వరకు వారి ప్రేమ వ్యక్తీకరణకు గవ్వలే ముద్దు. మొత్తం పన్నెండు వేల నత్త గుల్లల జాతుల్లో ఫిల్లిప్పీన్స్‌లో దొరికిన కోనస్ గ్లోరియామరీస్ అన్నింటిలో కెల్లా అరుదైనది, విలువైనదని అంటారు. ఇక గవ్వల రకాల్లో టాప్‌లో నిలిచే 'ది గ్లోరీ ఆఫ్ ఇండియా' అరేబియా సముద్ర తీరంలో దొరుకుతాయి. ఇక వెంటెల్ ట్రాప్‌లు అతిసున్నితమైనవి. బయటకు వంపులు తిరిగి ఉండే వీటినే ఒకప్పుడు కరెన్సీలా వాడేవారు. మెక్సికో అగాథంలో కనిపించే స్కాఫెల్లా జునోనియా, ఉత్తర కెరోలినా బీచుల్లో లభించే స్కాచ్ బన్నెట్, న్యూజిలాండ్ కోస్తాతీరంలో బయటపడే సన్‌బర్స్ట్ స్టార్ టర్బన్, ముళ్ల కిరీటాన్ని పోలే క్రైనర్స్ డాల్ఫిన్ నత్తగుల్ల, పపువా న్యూగినియా దగ్గరలోని మార్షల్ దీవుల్లో మాత్రమే దొరికే బుల్ శంఖాలు, రాతి నత్తల జాతికి చెందిన అలబాస్టర్ మ్యూరెక్స్ రకాల గుల్లలు అరుదైన, విలువైన వాటిలో వరసగా నిలుస్తాయి. ఇవి గానీ మీకు దొరికితే విలువైన గురుతు మీతో ఉన్నట్టే.

క్యాబ్రిట్

అలబాస్టర్ మ్యూరెక్స్

Check List

Book Number	KNSR02B121	Date	03/09/22
Front Cover	yes	Back Cover	yes
Blank Pages	NO		
Missing Pages	NO		
Prepared By	Mouni	Cutting By	Mouni
Scanned By	Shameera	Pages	29